# పంచారామములు - విశిష్టతలు

మరియు

# అష్టాదశ శక్తి పీఠములు



శ్రీ అమరేశ్వరస్వామి వారు

అమరావతి, గుంటూరు జిల్లా.



శ్రీ కుమారా రామ భీమేశ్వరస్వామి వారు

సామర్లకోట, తూర్పు గోదావరి జిల్లా.



శ్రీ ద్రాక్షారామ భీమేశ్వర స్వామి వారు

ద్రాక్షారామము, తూర్పు గోదావరి జిల్లా.




శ్రీ సోమేశ్వరస్వామి వారు

భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా.



శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి వారు

పాలకొల్లు, పశ్చిమగోదావరి జిల్లా.



- కోడిదాసు సుబద్ర

# పంచారామాలు-విశిష్టత
# అష్టాదశ శక్తి పీఠాలు



## కోడిదాసు సుభద్ర

## సరస్వతి పబ్లికేషన్

**కాజా వెంకటేశ్వరరావు వీధి, అరండల్ పేట,**
**విజయవాడ - 2.**

పంచారామాలు-విశిష్టత... అష్టాదశ శక్తి పీఠాలు

రచన:
కోడిదాసు సుభద్ర

ధర : 40/-

పేజ్ మేకింగ్:
సరస్వతి గ్రాఫిక్స్
విజయవాడ

కాపీరైట్ పబ్లిషర్స్

ప్రథమ ముద్రణ:
మే 2010

ముఖచిత్రం:
రమణ

పబ్లిషర్స్ :
**సరస్వతి పబ్లికేషన్**
కాజా వెంకటేశ్వరరావు వీధి,
అరండల్ పేట, విజయవాడ - 2

---

ఈ పుస్తకం కోసం ఎన్నో జాగ్రత్తలు తీసుకోవటం జరిగింది. అయినా పొరపాట్లు దొర్లి ఉండవచ్చును. మాకు తెలిపిన మలిముద్రణలో సవరించగలము.

## విషయసూచిక

### పంచారామాలు-విశిష్టత


1. పంచారామాల ఆవిర్భావం ..... 5
2. రుద్రాక్ష పుట్టుక ..... 9
3. అమరారామము (అమరావతి) ..... 10
4. అమరావతి చేరుటకు మార్గాలు ..... 11
5. కృష్ణానది అవతరణ ..... 11
6. క్రౌంచ తీర్థ విశేషం ..... 12
7. అమరావతి స్థూప విశేషాలు ..... 13
8. అమరావతిలోని ముఖ్య శాసనాలు ..... 14
9. బిళ్వదళ ప్రత్యేకత ..... 14
10. క్షీరారామము (పాలకొల్లు) ..... 15
11. క్షీర రామలింగేశ్వరుని మహిమలు ..... 18
12. కుమారారామము (సామర్లకోట) ..... 20
13. కుమార రామ భీమేశ్వర ఆజ్ఞ ..... 21
14. త్రిపుర సుందరీదేవి అనుగ్రహం ..... 22
15. దాక్షారామము (ద్రాక్షారం) ..... 25
16. అష్ట సోమేశ్వరములు ..... 26
17. సోమారామము (భీమవరం) ..... 30
18. శ్రీ సోమేశ్వరస్వామి మహిమలు ..... 32
19. ఈశ్వరుని పంచముఖాలు ..... 35


### అష్టాదశ శక్తి పీఠాలు


20. అష్టాదశ శక్తి పీఠాలు ..... 36
21. లంకాయాం శాంకరీదేవి ..... 38
22. కామాక్షి కాంచికాపురే ..... 39
23. ప్రద్యుమ్నే శృంఖలాదేవి ..... 39
24. చాముండీ క్రౌంచ పట్టణే ..... 40
25. అలంపురీ జోగులాంబా ..... 41
26. శ్రీశైలే భ్రమరాంబికా ..... 42
27. కొల్హాపురీ మహాలక్ష్మి ..... 43
28. మహూర్యే ఏక వీరికా ..... 44
29. ఉజ్జయిన్యాం మహాకాళీ ..... 45
30. పీఠికాయాం పురుహూతికా ..... 46
31. ఓఢ్యాయాం గిరిజా దేవి ..... 47
32. మాణిక్యా దక్షవాటికే ..... 48
33. హరిక్షేత్ర కామరూపా ..... 50
34. ప్రయాగే మాధవేశ్వరీ ..... 51
35. జ్వాలాయాం వైష్ణవీదేవి ..... 52
36. గయా మాంగళ్య గౌరికా ..... 53
37. వారణాస్యాం విశాలక్షీ ..... 54
38. కాశ్మీరేతు సరస్వతి ..... 55

ప్రతి శనివారం ఈ అద్భుత మౌన శిల నుండి మౌన చక్రం బయటకు వచ్చి సిద్ధులకు దర్శనమిస్తుంది. ఇది సృష్టిలో అత్యద్భుతమైన చర్యగా భావించవచ్చు. ఇక్కడ ఇంకొక ప్రత్యేకత ఉంది.

మౌన శిలలో ఒక మూల ఉన్న చిన్న గుంటలో నీరు ఉద్భవిస్తుంది. దాన్నుంచి మనం ఎంత నీరు తీసుకుంటే, మళ్ళీ అంతే నీరు తిరిగి ఉద్భవిస్తుంది. భక్తులు ఈ నీరును పవిత్రమైన గంగాజలంగా భావించి సేవిస్తారు.

యాత్రీకులు భక్తిగా, మౌనంగా, దీక్షగా అమ్మవారిని ప్రార్థిస్తే వారి కోరికలు తప్పక తీరుతాయని గట్టి నమ్మకం.

**- ఓం నమో జగన్మాత -**

✦ ✦ ✦







# పంచారామాలు-విశిష్టత

*శ్రీ మద్గంగా ధర సుతమ్*
*చంద్ర రేఖావతమ్ సినమ్*
*సిద్ధిదల సర్వ విద్యానామ్*
*వందే దంతావళాన నమ్*
*సితాంబుజిస్థితా దేవి।*
*వా క్రుసాదకరీ నృణామ్।*
*కర్ప్ూర ధవళాకారా।*
*నిత్యం వసతువాచిమే*
*శ్రీ లక్ష్మీ హయగ్రీవాయ నమః*

ఆంధ్ర ప్రదేశ్‌లో గల దివ్యక్షేత్రాలైన పంచారామముల స్థల పురాణముల వివరణ...

## పంచారామాల ఆవిర్భావం

వైకుంఠమున ద్వారపాలకులైన జయ విజయులు ఒకనాడు సనక సనందాదులను మహర్షులు శ్రీమహావిష్ణువుని దర్శనార్థం లోనికి పోవుతుండగా జయ విజయులు అడ్డగించారు.

సనక సనందాదులు లోనికి వెళ్ళనిమ్మని ఎంత చెప్పిననూ జయ విజయులు తమ పట్టు విడవలేదు.

అప్పుడు సనక సనందాదులు కోపముతో జయ విజయలిద్దరిని భూలోకంలో జన్మించమని శపించారు.

శేష తల్పమున శయనించిన శ్రీహరి లక్ష్మీసమేతుడై బయట జరుగుతున్న కలకలం విని వారిని సమీపించి ఋషుల శాపానికి తిరుగుండదని తనలో తను బాధపడి 'జయ విజయులారా! మీరు మూడు జన్మలెత్తి నాకు ప్రబల విరోధులై జీవించి తిరిగి నా వద్దకు వస్తారా! లేక ఏడు జన్మలెత్తి నాకు భక్తాగ్రగణ్యులై భూలోకంలో జీవించి తిరిగి వస్తారా! మీరే నిర్ణయించుకోండి!, అని శ్రీ మహావిష్ణువు చెప్పగా–

'స్వామీ! మీ సన్నిధానము వదలి ఏడు జన్మలు గడపలేము. మీతో విరోధించి మూడు జన్మలెత్తి మీ సన్నిధానానికి చేరే భాగ్యము పొందుతాము.' అని జయ విజయులు వేడుకున్నారు.

అనంతర కాలంలో కశ్యపునికి, దితికి హిరణ్యాక్ష, హిరణ్యకశిపులై జన్మించారు. వారు చేసే రాక్షస కృత్యాలు మితిమీరగా శ్రీమహావిష్ణువు వరహావతారం ధరించి హిరణ్యాక్షున్ని, నృసింహావతారము ధరించి హిరణ్యకశిపున్ని హతమార్చి భూలోకమున ధర్మరక్షణ గావించాడు.

హిరణ్యక్ష హిరణ్యకశిపుల మాతృమూర్తి దితి తన కుమారులిద్దరిని శ్రీహరి సంహరించాడని తెలుసుకుని భర్త కశ్యపున్ని తనకు జగదేక వీరుడైన పుత్రుని ప్రసాదించమని కోరింది.

ఆమె కోరికను మన్నించి భర్త కశ్యపుడు జగదేక వీరుడు అయిన పుత్రుడు కలుగుతాడని చెప్పాడు.

ఆ అనుగ్రహం వల్ల దితికి వజ్రాంగుడనే కుమారుడు పుట్టాడు. అతడు పెరిగి పెద్దవాడై వరాంగి అనే యువతిని వివాహమాడాడు. తల్లి దితి దేవతలపై ద్వేషభావము కలిగేటట్లు వజ్రాంగుడకు నూరిపోయడం వల్ల వజ్రాంగుడు దేవతలపై దండెత్తి ఇంద్రుడిని జయించి పట్టి బంధించాడు.

ఇంద్రుడు చేయునది ఏమీలేక బ్రహ్మను గూర్చి ప్రార్థించగా అప్పుడు బ్రహ్మ వజ్రాంగునకు నచ్చ చెప్పి ఇంద్రుడిని విడిపించాడు. తన మాట మన్నించి ఇంద్రుడ్ని విడిచి పెట్టినందుకు బ్రహ్మ సంతోషించి వజ్రాంగుడిని ఒక వరము కోరుకోమన్నాడు.

అప్పుడు వజ్రాంగుడు తనకొక జగదేక వీరుడైన పుత్రుడిని ప్రసాదించమని కోరుకున్నాడు.





కొంతకాలమునకు బ్రహ్మ వరప్రభావంగా వరాంగి గర్భవతియై నవమాసములు మోసి తారకుడనే పుత్రుడిని కన్నది.

తారకుడు జన్మించినపుడు రాబందులు వీరవిహారం చేశాయి. నక్కలు అరిచాయి. ప్రచండమైన గాలి తుపాను ఏర్పడింది.

తారకుడు పెరిగి పెద్దవాడై బ్రహ్మదేవుని గురించి తపస్సు చేసాడు. బ్రహ్మ తారకుడి తపస్సుకు మెచ్చుకుని ప్రత్యక్షమై 'తారకాసురా! నీ తపస్సుకు సంతోషించాను. నీకేమి వరంకావాలో కోరుకో' మని అడిగాడు.

అప్పుడు తారకాసురుడు శివ వీర్యం వలన పుట్టే పుత్రుడి చేత తప్ప నాకు చావులేకుండా వరం ఇమ్మని అడిగాడు. బ్రహ్మ తథాస్తు అని అంతరార్థమయ్యాడు.

మరల కొంతకాలము తరువాత శివుడి గురించి తపస్సు చేసాడు. శివుడు సాక్షత్కరించి 'తారకాసురా! ఎందుకు నా గురించి తపస్సు చేస్తున్నావు? నీకేమి కావాలో కోరుకో వరమిస్తాను' అని చెప్పగా– తారకాసురుడు 'దేవా నీ రక్షణ కావాలని తపస్సు చేస్తున్నాను. నాకు నీ పార్థివ లింగాన్ని ప్రసాదించాల'ని కోరుకున్నాడు.

శివుడు అమృత లింగాన్ని ప్రసాదిస్తూ 'తారకా నీవు ఈ లింగాన్ని మెడలో ధరించు. ఇది నీ మెడలో ఉన్నంతవరకూ శత్రువులు ఎవరూ నిన్ను జయించలేరు' అని చెప్పి శివుడు అంతరార్థమయ్యాడు.

ఇక తారకాసురుని సంతోషానికి అవధుల్లేవు. పార్థివ లింగాన్ని మెడలో ధరించి లోకాలును జయిస్తూ ఇంద్రుడిని జయించి భీభత్సాన్ని సృషించడం మొదలు పెట్టాడు.

దేవతలు తారకాసురుడు పెడుతున్న బాధలకు తాళలేక పోవుటచే దేవతలు బ్రహ్మను ప్రార్థించారు. అంతట బ్రహ్మ దేవతలను వెంటబెట్టుకుని వైకుంఠమునకు వెళ్ళి శ్రీహరిని ప్రార్థించారు.

మహావిష్ణువు ఆలోచించి 'తారకాసురుడు శివ వీర్యం వలనగాని మరణించడు.

కనుక హిమాలయ పర్వత సానువుల్లో తపస్సు చేసుకుంటున్న పార్వతి మీద శివునికి ప్రేమ కలుగునట్లు చేసి ఆమెతో వివాహమయ్యేటట్లు చెయ్యండి. వారి కలయిక వల్ల జన్మించిన పుత్రుడు తారకాసురుని వధించగలడు' అని కర్తవ్యబోధచేసాడు.

అప్పుడు ఇంద్రుడు పార్వతిపై శివుడికి ప్రేమకలుగునట్లు చేయమని మన్మథుడిని ఆజ్ఞాపించగా– మన్మథుడు ఇంద్రుని ఆజ్ఞానుసారము చెరకువిల్లు పుష్పబాణములతో హిమవత్పర్వతానికి బయలు దేరాడు.

అక్కడ పార్వతీదేవి శివుడికి పరిచర్యము చేస్తున్న సమయం చూసి శివుడిపై పుష్పబాణాలు సంధించాడు. ఆ బాణాల తాకిడికి శివుడి మనసు చలించింది. నేను నిష్ఠలో ఉన్నాను. నా మనస్సు చలించి పార్వతిపై ప్రేమానురాగాలు కలుగుటకు కారణమేమిటి? అని దివ్యదృష్టితో చూడగా మన్మథుడు కనిపించాడు.

అప్పుడు శివుడు తన మూడవ కన్ను తెరవగా ఎదురుగా ఉన్న మన్మథుడు భస్మమైపోవగా పక్కనే ఉన్న రతీదేవి శివుడికి ఇలా జరగడానికి గల కారణము వివరించి తనకు, తన భర్తకు ప్రాణభిక్ష పెట్టమని వేడుకుంది.

అంత శివుడు జాలిపడి 'నీ భర్త బ్రతుకుతాడు. అతను నీకు మాత్రమే శరీరముతో కనిపిస్తాడు' అని ఓదార్చి పంపాడు.

శివుడు పార్వతీదేవిని భార్యగా స్వీకరించాడు. దేవతలందరూ వారి కల్యాణానికి హాజరయ్యారు. కుబేరుని ఆధ్వర్యంలో విందుభోజనాలు తృప్తిగా చేసి దేవతలందరూ సంతుష్టులై వారి నిజవాసములకు చేరారు.

కొంత కాలమునకు పార్వతీ పరమేశ్వరులకు కుమారుడు జన్మించాడు. అతడు దేవతలకు సేనాధిపతిగా అయ్యాడు.

తారకాసురుని దుష్టప్రవర్తన మితిమీరుటచే దేవతలందరూ కలసి సైన్యాన్ని ఇచ్చి కుమారస్వామిని తారకాసురుడి మీదకు యుద్ధానికి పంపారు.

ఇరువురూ అస్త్రశస్త్రములతో ఘోర యుద్ధము జరిపిరి. కుమారస్వామి శక్తి ఆయుధాన్ని తారకాసురునిపై ప్రయోగిస్తే తారకాసురుడు ముక్కలు ముక్కలుగా అయి తిరిగి మామూలు రూపు ధరించి యుద్ధము చేయుచున్నాడు.

అప్పుడు శ్రీమహావిష్ణువు కుమారస్వామితో 'కుమారా! వీని కంఠమున అమృతలింగమున్నది. అది అతని మెడలో ఉన్నంతకాలము అతడు మరణించడు. కావున ఆగ్నేయాస్త్రము ప్రయోగించి ఆ అమృతలింగమును ఖండఖండాలు అయ్యేట్లు చేయుము. అవి మరల అతుక్కోకుండా అవి పడిన చోట నేను వాటిని ప్రతిష్ఠించి దేవాలయాలు ఏర్పాటుచేస్తాను' అని చెప్పాడు.

అప్పుడు కుమారస్వామి ఆగ్నేయాస్త్రము ప్రయోగించగా తారకాసురుని మెడలోని శివుని పార్థివ లింగం అయిదు ఖండములై అయిదు చోట్ల పడినవి.





ఓంకారనాదంతో అవి తిరిగి అతుక్కోవడానికి ప్రయత్నిస్తుండగా శ్రీమహావిష్ణువుచే ప్రేరేరింపబడి సూర్యభగవానుడు అక్కడ దేవాలయాలు నిర్మింపజేశాడు.

ఇప్పటికీ ఆ అయిదు లింగాలపై ఆగ్నేయాస్త్రధాటికి దెబ్బలున్నాయి. మెడలో పార్థివ లింగము లేకపోవుటచే కుమారస్వామి చేతిలో తారకాసురుడు నిర్యాణమొందెను. దీంతో దేవతలందరూ సంతోషంతో పూలవాన కురిపించారు.

తారకాసురుని మెడలో వేలాడుతున్న శివుని పార్థివలింగం యొక్కభాగాలు పడిన ఆ అయిదు ప్రదేశాలకు 'ఆరామము'లని పేరు వచ్చినవి.

*అమరారామంలో అమరేశ్వరుడు (అమరావతి)*
*దాక్షారామంలో భీమేశ్వరుడు (ద్రాక్షారామం)*
*సోమారామంలో సోమేశ్వరుడు (భీమవరం)*
*కుమరారామంలో భీమేశ్వరుడు (సామర్లకోట)*
*క్షీరారామంలో క్షీరరామలింగేశ్వరుడు (పాలకొల్లు)*

అలా శివునికి ఆ పేర్లతో ప్రసిద్ధ దేవాలయాలుగాను దినదిన ప్రవర్ధమాన శోభితమై ఇప్పటికీ ఆలయాలు అలరారుచున్నాయి.

## రుద్రాక్ష పుట్టుక

పూర్వ కాలమున త్రిపురాసురుడను రాక్షసుడుండేవాడు. ఎవరూ అతనిని ఓడించలేకున్నారు. అతడు పెట్టు బాధలకు బ్రహ్మాది దేవతలు వేదన పడుతున్నారు. అంతట వారందరూ కైలాసమునకు వచ్చి శివుని ప్రార్థించారు.

అపుడు శివుడు నా వద్ద అఘోర అనే దివ్యాస్త్రం ఉన్నది. దానికి సమస్త ఉపద్రవాలను శాంతింపజేయు శక్తి గలదు. అని త్రిపురాసురుడిని వధించి దేవతలనుద్ధరించు కొరకు అఘోర అస్త్రం గురించి ఆలోచిస్తూ కనులు మూసుకొనగా అప్పుడు ఆ నేత్రముల నుండి కొంత నీరు భూమిపై పడింది.

ఆ అశ్రు బిందువుల నుండి మహారుద్రాక్ష వృక్షమై మొలచినది. నా ఆజ్ఞతో సకల దేవతల సుఖప్రాప్తి కొరకు 38 రూపాల రుద్రాక్షలు ఉద్భవించినవి. నా యొక్క సూర్యుని నేత్రము నుండి పన్నెండు రకముల రుద్రాక్షలు అనేక రకాల వర్ణము గలవియు, చంద్ర నేత్రము నుండి పదహారు రకముల రుద్రాక్షలు తెలుపు వర్ణము గలవియు, అగ్ని నేత్రము నుండి పది రకముల రుద్రాక్షలు నలుపు వర్ణము కలవి ఉత్పత్తి అయినాయి.

శ్వేత వర్ణము గల రుద్రాక్షలు బ్రాహ్మణులు, రక్త వర్ణము గల రుద్రాక్షలు క్షత్రియులు, మిశ్రమ వర్ణములు గలవి వైశ్యులు, కృష్ణవర్ణము గల రుద్రాక్షలు శూద్రులు ధరించి ఆయురారోగ్యైశ్వర్యములు పొందెదరు.

ఏక ముఖ రుద్రాక్ష శంకర రూపముగను, ద్విముఖ రుద్రాక్షలు పార్వతీపరమేశ్వరుల రూపముగానూ, పంచముఖ రుద్రాక్షలు కాలాగ్ని నామ రుద్రునిగా రూపుదిద్దుకున్నవి.

ఏక ముఖ రుద్రాక్ష పరతత్వ ప్రకాశము గలవి. ద్విముఖ రుద్రాక్ష అర్ధనారీశ్వర రూపము, పంచముఖ రుద్రాక్షలు బ్రహ్మ స్వరూపము. వీటి వల్ల సకల కోరికలు నెరవేరుచుండును.

సంక్రాంతి, అమావాస్య, పూర్ణిమ, గ్రహణాది పర్వ దినములందు ధరిస్తే సకల పాపములు తొలగిపోయి దివ్యకాంతి ప్రభలతో వెలుగొందుతారని పరమేశ్వరుడు తెలిపాడు.

## 1. అమరారామము (అమరావతి)

అష్టాదశ పురాణాలలో ఒకటియైన స్కాంద పురాణంలో ఇంద్రాది దేవతల చేతను, దిక్పాలుర చేతను శివలింగము ప్రతిష్ఠించబడుట చేత ఈ శివలింగమునకు అమరేశ్వరుడిగా నామము కలిగి పంచారామములలో అమరారామంగా కొనియాడబడుతుంది.

ఈ పుణ్యక్షేత్రము కృష్ణానది ఒడ్డున కలదు. అందుచే పురాణాలలో క్రౌంచ తీర్థంగా ప్రసిద్ధికెక్కింది. కలి దోష నివారణ కొరకు శౌనకాది మహా మునులకు నారద మహర్షి భూలోకమునందు గల పవిత్ర పుణ్య స్థలములకు గల మహత్యాన్ని వివరిస్తూ ఈ అమరేశ్వరారామం గురించి వివరించినట్లు పురాణాలలో గలదు.

పవిత్ర కృష్ణవేణీనదీ తీరమునందు ఉండుట వలన తీర్థమైనది. భక్తులు పుణ్య నదిలో స్నానమాచరించి అమరేశ్వర స్వామిని సేవించు కొనుటకు వీలుగా రేవు కూడా నిర్మించబడినది.

'విజయాఖ్య ముహూర్తేస్మిన్ స్థాప్యైనం శివమనర్చతు' విజయదశమి శుభదినాన విజయ ముహూర్త కాలమున దేవగురువైన బృహస్పతి ఆదేశానుసారము సురరాజు అయిన దేవేంద్రుడు తారకుడు ధరించిన శివలింగాలలో ఒక శకలమును ప్రతిష్ఠించెను.

ఆ లింగము స్వచ్ఛమైన ధవళకాంతి ప్రభలతో ప్రతిష్టించిన వెనువెంటనే పెరిగి పోవుట ప్రారంభించింది. అపుడు దేవేంద్రుడు బంగారు పుష్పములతోను, మారేడు దళములతోను, శివారాధనచేసి లింగముపైన చీలకొట్టి పవిత్ర కృష్ణవేణీ జలములతో అభిషేకించగా లింగము పెరుగుట ఆగినది.





అనంతరం దేవతలు, అంబిక మున్నగు పరివార దేవతలను ఆగమాను బద్ధముగాను శివ పంచాయతనము అగునట్లు ప్రతిష్టించారు.

అప్పటినుండి ముక్కోటి దేవతలు శత్రుజయముకోరి కొంతకాలం అమరేశ్వరుని సేవిస్తూ గడిపారు. అమరులు నివాసమేర్పరుచుకుని యుండుట చేత అమరారామంగా లోకప్రసిద్ధి చెందింది.

సకల దేవరూపుడగు అమరేశ్వరస్వామిని దర్శించి సేవించుకున్నవారికి 'పునర్జన్మ నవిద్యతే' మరలా జన్మ ఉండదు. శివసాన్నిధ్యాన్ని పొందుతారు.

ఈ తీర్థమునందు నూరుకోట్ల తీర్థాలు గలవు. అందుచేత ఈ తీర్థమందు స్నానమాచరించువారికి మూడు జన్మల పాపములు అగ్నిచే దహింపబడునట్లు నశించును.

అంతేగాక వేయిగోవులను దానమిచ్చిన ఎంత ఫలము కలుగునో అంత ఫలితము లభించును. సహస్ర యజ్ఞములు చేసిన ఫలము కలుగుతుందని శ్రీనాధుడు చెప్పాడు.

## అమరావతి చేరుటకు మార్గాలు

పంచారామ అమరావతీ క్షేత్రము ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుజిల్లా, గుంటూరు నగరానికి ఉత్తరంగా 32 కిలోమీటర్ల దూరంలో ఉంది. విజయవాడ నుండి, గుంటూరు నుండి నేరుగా అమరావతి చేరుటకు బస్సు సౌకర్యం కలదు.

ఈ క్షేత్రమందు యాత్రికులకు వసతి సమకూర్చుటకు ధర్మసత్రాలు ఉన్నాయి. దేవాలయానికి దగ్గరగా శ్రీరామకృష్ణధర్మ సత్రము, చింతపల్లి జమీందారుగారి సత్రము, వైశ్య సత్రాలు ఉన్నాయి.

ఈ ఆలయానికి దగ్గరలో దర్శించుకోవలసినవి. రామాలయం, గీతామందిరం, పాండురంగస్వామి ఆలయం, జైన ఆలయం, మ్యూజియానికి సమీపంలో వైకుంఠ పురమునందలి కొండపై వెలసిన శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం.

## కృష్ణానది అవతరణ

బ్రహ్మదేవుడు సృష్టి చేయునపుడు భూలోక వాసులకు ధర్మార్ధకామమోక్షాలు సిద్ధించుటకు మార్గం చెప్పవలసిందిగా శ్రీహరిని కోరాడు. అపుడు శ్రీహరి తన అంశతో కృష్ణను సృజించాడు.

భూలోకమునకు వచ్చి పర్వతరూపంతో తపస్సు చేసుకుంటున్న సహ్యమునిని చూసెను.

ఈ పుడమిని తరింపజేయుటకై విష్ణు స్వరూపిణి కృష్ణఇక్కడకు వచ్చియున్నది. అని శ్రీహరి చెప్పగా సహ్యముని 'నాపై మీరిరువురు నివసించి నన్ను కృతార్థుడిని చేయండి' అని ప్రార్థించగా–

'సహ్యమునీంద్ర! నీ తపస్సు ఫలించింది. నేను శ్వేతాశ్వత్థము (రావిచెట్టు) గను ఏర్పడి కృష్ణానది ఆ వృక్ష అంతర్భాగాన పుట్టి ఎనిమిది వందల మైళ్లు ప్రవహించి సాగరాన్ని చేరుతుంది.' అని శ్రీహరి చెప్పగా తన జన్మ తరించినది అని సహ్యముని భావించాడు.

ఈ నదికి ఇరువైపులా ఆంధ్రప్రదేశ్‌లో శ్రీశైల మందలి పాతాళగంగ తీర్థము, అమరావతి యందలి క్రౌంచ తీర్థము, వైకుంఠ పురమందలి అనంత తీర్థము, విజయవాడ యందలి దుర్గాతీర్థము, శ్రీకాకుళ మందలి ముక్తిక్షేత్ర తీర్థము, హంసలదీవి యందలి కృష్ణాసాగర సంగమ తీర్థములు ముఖ్యమైనవి.

ఈ సహ్యపర్వతము పడమట కనుమలలోగలదు. ఈ కృష్ణవేణీ నది జీవవాహినియై ప్రవహించుట వలన అమరావతీక్షేత్రం తీర్థరాజమైంది.

## క్రౌంచ తీర్థ విశేషం

క్రౌంచగిరిపై ఇంద్రుడిచే ప్రతిష్ఠితుడైన అమరేశ్వరుడు కరుణా కటాక్షములకై అమరులు నివసించిన కారణంగానూ, కృష్ణానదీ తీరంలోనే వెలయుట వలన అమరావతీ తీర్థముగా కూడా అయింది.

ఇక్కడకు మునులు, సిద్ధులు తపస్సు చేయుట కొరకై వచ్చేవారు. ఇక్కడ గతంలో దేవతలు, మునులు తపస్సు చేసి కృతార్థులగుట వలన ఇది సిద్ధిక్షేత్రంగా పిలువబడుచున్నది.

పూర్ణిమ, అమావాస్య, ద్వాదశి ఆర్ద్రా నక్షత్రము, సూర్యచంద్ర గ్రహణాలను, దక్షణోత్తరాయణములందు ఈ తీర్థమందు స్నానమాచరించి అమరేశ్వరుని సేవించినవారికి సహస్రయజ్ఞ ఫలితం కలుగుతుంది.

అమరేశ్వరస్వామి మూలవిరాట్టు లింగము సుమారు పది అడుగుల ఎత్తు వరకు కలిగి ఉంటుంది.

స్వామి స్ఫటిక వర్ణముతో ప్రకాశించుచుందును. మండపాల సమీపమున మారేడు వృక్షము, పున్నాగ వృక్షములు, కృష్ణానది చాలా అందంగా శోభతో ఉన్నాయి.





గోపురం నుండి ప్రదక్షిణ రీతిలో బయలుదేరినట్లయితే మొదట ప్రణవేశ్వరుడు, శంకరాచార్యుడు, కాశీ విశ్వేశ్వరుడు, ఉమా మహేశ్వరుడు, దత్తాత్రేయ స్వామి, జ్వాలాముఖిదేవి, రుద్రపాదములు, అగస్తేశ్వరుడు, సోమేశ్వరుడు, పార్థివేశ్వరుడు, నాగేశ్వరుడు, కోసలేశ్వరుడు, మహిషాసుర మర్ధని, వీరభద్రుడు అను దేవతామూర్తులు ఉన్నారు.

ఇక్కడ ఉన్న కళ్యాణమండపం నుండి కృష్ణానదికి వెళ్ళే దారి ఉంది. ఇక్కడ మూడు ప్రాకారములు ఉన్నాయి. కుమారస్వామి, ఆంజనేయస్వామిల ఆలయములు ఉన్నాయి.

మూడన ప్రాకారంలో ప్రదక్షిణ పద్ధతిలో పరిశీలించిన నైఋతిప్రాంతాన శ్రీశైల మల్లిఖార్జునుడు, వాయువ్యదిశలో కాశీ విశ్వేశ్వరుడు, ఈశాన్యదిశలో చండీశ్వరుడు, ఆగ్నేయాన శ్రీకాళేశ్వరుడు ప్రతిష్ఠ చేసారు. ఆయా పుణ్యక్షేత్రాలు కూడా ఆయాదిశలలోనే ఉన్నాయి.

ఈ క్షేత్రాలలో కాలభైరవుడు క్షేత్రపాలకుడు. ఇక రెండవ ప్రాకారంలో నైఋతిన కాలభైరవుడు అమరేశ్వర క్షేత్రపాలకుడు. తూర్పున ధ్వజస్థంభాల దగ్గరలో ప్రత్యక్ష దైవమయిన సూర్యభగవానుడు ప్రతిష్ట చేయబడుటచేత పంచాయతన క్షేత్రమై అలరారుచున్నది.

ఇక్కడ నాలుగు దిక్కులా ధ్వజ స్థంభాలుండటం ప్రత్యేకత. ప్రధానాలయంలో నందీశ్వరుని దర్శించి అమరేశ్వరున్ని దర్శనం చేసుకుని తరువాత శ్రీబాలచాముండేశ్వరికి నమస్కరించి మొక్కులు చెల్లించుకుంటారు.

## అమరావతి స్థూప విశేషాలు

అమరావతీ స్థూపం వంద అడుగుల ఎత్తు, నూట ముప్పై ఎనిమిది అడుగుల వ్యాసం, అయిదువందల ఇరవై ఒకటి అడుగుల చుట్టు కొలత కలిగి జాతక కథావిశేషముతోను, శిల్పకళా వైభవాలతో అలరారుతుంది.

బుద్ధదేవుని ధాతువుపై నిర్మించబడింది. ఆచార్య నాగార్జునుడు శాతవాహనుల అంద చందాలతో స్థూపమునకు వినూత్న శోభ చేకూరింది.

ఇక్కడ విశ్వవిద్యాలయం కలదు. స్వదేశీయులకే కాక విదేశీయులు, చైనా, జపాన్, సింహళం నుండి విద్యార్థులు వచ్చి ఇక్కడ విద్య నేర్చుకునేవారు.

అమరావతిని గురించి విశేషాలు స్కాందపురాణం సహ్యాద్రి ఖండంలోను, బ్రహ్మపురాణం పూర్వఖండంలోను, పద్మపురాణం ఉత్తర భాగంలోను దీని గురించి చెప్పబడింది.

## అమరావతిలోని ముఖ్య శాసనాలు

చింతపల్లిని రాజధానిగా చేసుకుని రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు చింతపల్లి జమీందారుగా పరిపాలించాడు.

ఈ ప్రాంతమంతా భయంకర అరణ్యాలతో నిండి యుండుట చేత, చెంచుల ఆగడాలకు అంతులేక పోవుటచేత అమరేశ్వరుని ఆజ్ఞ ప్రకారం రాజధానిని అమరావతికి మార్చారు.

క్రీ॥శ॥ 1795లో అమరావతిలోని అమరేశ్వరుని ఆలయ సమీపమున ధరణి కోటను నిర్మించారు.

అమరావతి క్షేత్ర విశిష్టతను తెలుపు శిలా శాసనాలు అమరేశ్వరాలయంలో భద్ర పరచబడి ఉన్నాయి. వాటిలో కొన్ని సంస్కృతభాషలో, కొన్ని తెలుగు పద్యరూపాలుగా శాసనాలు ఉన్నాయి.

కొమ్మనాయని శాసనంలో క్రీ॥శ॥ 1158 శ్రీ అమరేశ్వర దేవరకు అఖండ వత్తిదీపం బూనకిచ్చెను యాభై అయిదు గొరియలు.

కోటచేత రాజుల శాసనంలో అమరేశ్వరదేవుడికి 275 ఇనుప మెట్లిచ్చారు. బ్రాహ్మణులకు అగ్రహారాలకు కానుకగా ఇచ్చారు.

శ్రీ కృష్ణదేవరాయల శాసనంలో క్రీ॥శ॥ 1517 పెదమద్దూరు గ్రామం విద్యావరేణ్యులకునూ, నిడమానూరుగ్రామంలో తమ పురోహితుడు శ్రీ రంగనాథ దీక్షితుల వారికి ఎన్నో దానధర్మాలు చేసినట్లు పేర్కొనబడింది.

## బిల్వదళ ప్రత్యేకత

బిల్వదళ మంటే మారేడు పత్రి. ఈ మారేడు చెట్టుకు శ్రీఫలం అనే పేరు కలదు. 'త్రిదళం త్రిగుణాకారం! త్రినేత్రం చత్ర్యయాయుధమ్, త్రిజన్మ పాపసంహారం ఏకబిల్వం శివార్పణమ్' అనుట వలన త్రిదళం మూడు ఆకులు కలది. త్రిగుణాకారం అనగా సత్వ, రజస్తమో గుణములు త్రినేత్రంచ మూడు వైపులా ఆకులు కలది.

శివుడు త్రినేత్రుడు గావున శివపూజకు పవిత్రత సంతరించు కున్నది. త్రిశూలం యొక్క ఆకారంలో ఉండుటచేత త్రియాయుధమ్ అన్నారు. త్రిజన్మ అనగా భూతవర్తమాన భవిష్యత్తు జన్మలలోని పాపాలను నశింప చేస్తున్నాయని మారేడు త్రిదళములోని సంఖ్య మనోవాక్కాయ కర్మలకు సంకేతం. దీనితో పూజ చేసిన ఆ మూడింటిని శివార్పణ చేస్తున్నామని భావం.





పండిన మారేడు ఫలంలోని గుజ్జును తీసి దానిలో విభూతి ఉంచి త్రిసంధ్యలు నుదుట ధరిస్తే జన్మజన్మాంతర పాపాలు దూది రేణువులా నశించగలవు. మారేడు కషాయము ఒంటిలోని వేడిని తగ్గిస్తుంది.

ఆ కాయరసాన్ని, కొబ్బరినూనెను కలిపి దానిని తలకు రాసుకుంటే తలపోటు, జలుబు తగ్గడమే కాకుండా వెంట్రుకలు నల్లబడతాయి. మారేడు ఫలంలోని గుజ్జు అజీర్ణము, అపస్మారకం, మధుమేహం తగ్గించడంలో ఈ ఫలంలోని విశిష్టత. మహాశివరాత్రినాడు బిల్వపత్రపూజ జరిపితే విశేష ఫలం దక్కుతుంది.

## 2. క్షీరారామము (పాలకొల్లు)

కోదండ రాముడు సీతాలక్ష్మణ సమేతుడై రావణ సంహానంతరము దండకారణ్యము ప్రవేశించెను.

శివభక్తుడు, నవ వ్యాకరణ పండితుడు, శివతాండవ స్తోత్రమును రచించి ధ్యానించినవాడు, లంకేశుడు అగు కొన్ని వేల సంవత్సరాలు పరిపాలన దక్షత కలిగి పాలించిన మహాయోధుడు, సద్బ్రాహ్మణుడైన రావణబ్రహ్మను సంహరించిన వెంటనే శ్రీరాముని శరీరం నలుపుగా మారిపోయింది.

శ్రీ రఘురాముడు దండకారణ్యములో తిరుగుతుండగా ఒకనాడు అగస్త్యముని కనిపించాడు.

అప్పుడు శ్రీరాముడు 'మునీంద్రా నా యొక్క రూపం ఇలా నల్లగా మారుటకు కారణం తెలియటంలేదు. తమరు నాకు వివరించవలసింది'గా కోరిన తరువాత అగస్త్యమహాముని దివ్యదృష్టితో చూసి...

'ఓ రామచంద్రా! రావణాసురుని నీవు సంహరించితివి. నీకు బ్రహ్మ హత్యాదోషం చుట్టుకుంది.

అందుకే నీ శరీరం నల్లగా మారింది. దానికి నీవు శివభక్తి దురంధరుని వధించితివి గనుక నీవు తీర్థయాత్రలు చేస్తూ పవిత్ర స్థలములందు శివలింగములను ప్రతిష్ఠించుచుతూ పుణ్యనదులలో స్నాన మాచరించిన స్వస్థత కలుగుతుంది' అని చెప్పాడు.

అప్పుడు శ్రీరాముడు పవిత్ర గోదావరి నదిని దాటి పోలవరం కొయ్యలగూడెం మీదుగా ఆలపాటి దిబ్బలు దాటుతుండగా శ్రీరాముడు, సీత ముందు నడుస్తూ వెనుక లక్ష్మణుడు నారబట్టల మూట నెత్తిన పెట్టుకుని

నడుస్తుండగా హఠాత్తుగా లక్ష్మణుడు నెత్తిమీదనున్న బట్టల మూట కిందపడవేసి 'ఈ బట్టలమూటను నేను మోయను. నేనెందుకు మోయాలి? నేనేమైనా మీ సేవకుడినా?' అని అన్నగారిని, సీతమ్మను దురుసుగా మాట్లాడాడు.

అప్పుడు సీత 'నాథా! ఏమి ఈ విచిత్రం! ఇంతవరకు మీసేవయే నాకు పరమావధి అన్న లక్ష్మణుడు ఇపుడు ఇంత తిరస్కారభావంతో మాట్లాడటం తగునా?' అని అడిగింది.

అంతట శ్రీరాముడు 'ఈ విషయాన్ని పట్టించుకోకు నీవు. మనం తొందరగా ఈ ప్రాంతాన్ని దాటాలి. పద వెళదాం' అని బయలుదేరారు.

కొంతదూరం వెళ్ళేసరికి లక్ష్మణుడికి కోపం తగ్గి తిరిగి యధారూపంగా అన్నగార్కి, వదినగార్కి సేవలు చేయడం మొదలు పెట్టినాడు. 'ఏమిటి నాథా! ఈ విచిత్రం?' అని అడగ్గా-' అది ఆ స్థల మహత్యం. ఆ బాట వైపు అడుగు పెట్టేసరికి ఆ విధమైన వీరావేశము కలిగినది' అని చెప్పి ముందుకు సాగినారు.

అక్కడ నుండి తాడేపల్లి గూడెం మీదుగా పవిత్ర గోస్తనీ నదీప్రాంతము చేరుకున్నారు. అదే ఇప్పుడు వాడుకలో ఉన్న రామేశ్వరము. ఇంతకు పూర్వము 'నత్తారామేశ్వరం' అని పిలువబడుచుండేది.

దివ్యరూపులైన శ్రీ సీతారాములు అక్కడ విశ్రాంతి తీసుకుంటానికి నిశ్చయించుకున్నారు. సీత భర్తతో 'రేపు ఉదయం ఇక్కడ శివలింగము ప్రతిష్ట జరపాలి కావున హనుమని శివలింగార్థమై పంపితిమి. ఇంకనూ తిరిగిరాలేదు. ముహూర్తము సమీపిస్తున్నది' అని సీత అంది.

తరువాత పవిత్ర గోస్తనీ నదిలో స్నానము చేసి అక్కడున్న నత్తలతో కూడియున్న మట్టితో శివలింగము తయారుచేసి ముహూర్త వేళకు నది మధ్యలో శివలింగ ప్రతిష్ఠ జరిపిరి.

అనంతరం కొద్ది క్షణాలకు ఆంజనేయస్వామి లింగము తెచ్చెను. శివలింగ ప్రతిష్ఠ వేళ సమీపించుటచే ఇక్కడ శివలింగమును ప్రతిష్ఠించామని సీతమ్మ చెప్పగా ఆంజనేయుడు అలుక వహించి మాట్లాడలేదు.

అది గమనించిన శ్రీరాముడు 'ఆంజనేయా! నీవు తెచ్చిన ఈ లింగమును ఈ ఒడ్డున ప్రతిష్ఠ చేస్తున్నాము.

భక్తులు ముందు నీవు తెచ్చిన శివలింగానికి పూజలు జరిపిన తర్వాత నీటిలో గల శివలింగాన్ని దర్శించిన పుణ్యఫలము వచ్చును. నేరుగా ఈ లింగాన్ని దర్శిస్తే పుణ్యముండదు.' అని వరమిచ్చాడు.





అప్పుడు ఆంజనేయుడు సంతోషించి రామనామజపము చేసుకుంటూ వారికి సేవలు చేస్తూ పెనుగొండ చేరుకుని వీధి వీధికి శివలింగములు ప్రతిష్ఠించారు.

ఇప్పటికీ లింగములు దారి మధ్య కనబడుతూనే ఉంటాయి. త్రేతాయుగంలో అనగా సుమారు 86 వేల సంవత్సరముల క్రితం అనగా ఇపుడు పాలకొల్లు పేరుగల చోట క్షీరలింగమును ప్రతిష్ఠింపగా క్షీరారామంగా పూజలు అందుకుంటూ దేదీప్యమానంగా విరాజిల్లుతున్నాడు. దినదిన ప్రవర్థమానంగా నిత్యపూజలు, నైవేద్యములు అందుకొనుచున్నాడు.

మూలవిరాట్‌ని నాలుగు వైపుల నుండి చూచుటకు వీలుగా చిన్నకిటికీలు ఉన్నాయి. పానపట్టము నుండి జారిన ఉదకము, సోమ సూత్రముగుండా ఉత్తరం వైపు నుండి పోవుటకు చిన్నకాలువ అమర్చారు.

ఈ లింగమునకు గాట్లు పడి ఉంది. కుమారస్వామి బాణధాటికి పడినగంట్లు అని అంటారు. మూలవిరాట్ లింగానికి ఎదురుగా నందీశ్వరుడు, జయగంట కలదు.

విఘ్నేశ్వరుని విగ్రహము ఈ మండపం గోడకు అమర్చి ఉంది. విఘ్నేశ్వరునికి ఎదురుగా గర్భాలయానికి ఎడమవైపున విభూతిపండు ఆకారంలో లింగము అమర్చబడి ఉంది.

నందీశ్వరునికి ఎడమ భాగము నుండి కుడివైపు వరకు భక్తులు, వదాన్యులు, పురప్రముఖుల ఆదరణతో చలువ రాళ్లు పరచబడి రంగురంగుల డిజైన్‌తో చలువరాళ్లు చూడ ముచ్చటగా ఉంటాయి.

దివ్యశోభాయమానంగా నూట ఎనిమిది రాతి స్థంభాలు కలిగి శిల్పవైభవముతో వెలుగొందు చున్నది.

నందికి ఎడమ వైపు మొదలుకుని సూర్యభగవానుడు, పార్వతీ అమ్మవారు, కాశీ విశ్వేశ్వర లింగము, నగరేశ్వర లింగము, లక్ష్మీ అమ్మవారు, వీరభద్రుడు, డుంఢి విఘ్నేశ్వరుడు, కనకదుర్గ అమ్మవారు, సప్త మాతృకలు, కుమార స్వామి, బ్రహ్మ, సరస్వతి, కార్తికేయుడు, నాగసర్పములు, మహిషాసుర మర్దని, సుందర ఉప సుందరులు, దత్తాత్రేయుడు, నటరాజు, కాలభైరవుడు, శనీశ్వరుడు, నాగేశ్వరుడు, రాధాకృష్ణులు, శంకర భగవత్పాదులు కొలువు తీరి ఉన్నారు.

స్వామివారి పవళింపు, ఆభరణముల గది ఉన్నది. దేవాలయ మంటముపై విశ్వేశ్వరుడు, శివపార్వతులు, తుంబురుడు కొలువైయున్నారు.

## క్షీర రామలింగేశ్వరుని మహిమలు

పూర్వం దండకారణ్య సమీపాన వర్ధనపురం అనే గ్రామం ఉండేది. ఆ గ్రామానికి కొంత దూరంలో క్షీరపురి అనేచోట శ్రీ క్షీరారామలింగేశ్వర ఆలయము కలదు. అక్కడ గోవిందయ్య అనుషావుకారు నివసిస్తుండేవారు. అతని భార్య లీలావతి.

భార్యాభర్తలు ఇద్దరూ దైవ భక్తి తత్పరులై ఆ గ్రామానికి చుట్టుపట్ల ఉన్న గ్రామాలలో కెల్లా సంపన్న గృహస్థులు, వారిది పెద్ద భవన లోగిలి. ఆ భవనంలో ఒక బోషాణం నిండా బంగారు నగలు, ఆభరణాలు ఉన్నాయి.

గోవిందయ్యకు వంద ఎకరాల మాగాణి, మరో వంద ఎకరాల మామిడితోటలు, పాడి, పంట, పశు సంపదతో సకల సౌఖ్యాలతో తులతూగుచున్నారు.

వారి ఇంటిలో ఆడమగ మొత్తం పనివారు ఇరవై మంది ఉన్నారు. ఇంత ఆస్తి అంతస్థు ఉన్నా వారికి సంతానం లేదు. ఆ గ్రామంలోని వారందరూ గోవిందయ్యకు సంతానం కలిగితే చాలా ఆనందంగా ఉంటుందని తలపోసేవారు.

ఎవరు ఏమి చెబితే వారు అలా చేసేవారు. సంతానం కోసం ఎన్నో రకాల మందులు వాడారు. ఎన్నో పుణ్యక్షేత్రాలు దర్శించారు. కానీ సంతాన భాగ్యం కలుగలేదు. ఇలా కొంతకాలం గడిచింది.

ఒకనాడు ఒక స్వాములవారు దండకారణ్యంలో నుండి తపస్సు చేసుకుని ఆ ఊరు వచ్చారు.

శిష్యుల ద్వారా స్వాములవారి గురించి తెలుసుకుని ఆ చుట్టు పక్కల ఊర్ల నుండి జనం స్వామివారిని దర్శించుకుని, వారి ఆశీర్వాదం తీసుకుని తమ బాధలని తీర్చుకుని వెళుతున్నారు.

ఆ విషయాన్ని తమ పరిచారిక ద్వారా గోవిందయ్య భార్య లీలావతి తెలుసుకుని తన భర్తతో కలిసి స్వాములవారిని దర్శించుకుని తమ ఇంటికి వచ్చి తమ ఆతిధ్యము స్వీకరించవలసిందిగా కోరారు.

ఆ భార్యాభర్తల మాటను మన్నించి ఆ స్వాములవారు 'రేపు ఉదయం వస్తాను' అని చెప్పాడు.

మరునాడు గోవిందయ్య ఇంటికి వెళ్ళి వారి ఆతిధ్యమునకు మెచ్చి 'భక్తా ఏమిటి నీ కోరిక?' అని అడిగారు.





'తమరు త్రిలోక పూజ్యులు. మిమ్మల్ని చూడగానే ఆ భగవంతుడే మీ రూపంలో వచ్చారేమో అనుకుంటున్నాము. నాకు సకల ఐశ్వర్యాలు ఉన్నాయి. కాని ఏం లాభం? ఇంతవరకూ మాకు సంతాన భాగ్యం కలుగలేదు' అని గోవిందయ్య చెప్పాడు.

అంతలో భార్య లీలావతి 'స్వామీ! మేము తిరగని పుణ్యక్షేత్రం లేదు. ఎన్నో పుణ్యనదులలో స్నానమాచరించి దానధర్మాలు చేసాము. మేము ఎందుకు సంతానవంతులం కాలేదు?' అని వాపోయింది.

స్వాములవారు దివ్యదృష్టితో అంతా గమనించి 'ఓ పుణ్యదంపతులారా! మీ ఇలవేల్పు గోపాలకృష్ణుడు. ఇక్కడకు దగ్గరలో క్షీరారామలింగేశ్వర ఆలయం ఉంది. మీరు ఆ స్వామిని దర్శించినారా?' అని అడిగారు.

గోవిందయ్య దంపతులు 'దర్శించలేదు స్వామీ' అని జవాబు చెప్పారు.

'పరమేశ్వరుడు సర్వాంతర్యామి! ఆది దేవతలతో నిర్మించబడింది క్షీరారామము పంచారామ సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం. ఈ దేవాలయంలో 'ఆదిత్యమంబికావిష్ణుం గణనాధ మహేశ్వరమ్ సర్వేష్టం సారభూతంచ పంచగేవాయసేనమ్' ఈ ఆలయంలో పంచాయతన మూర్తులు వెలసియున్నారు.

పంచాయతన మూర్తులనగా గణపతి, సూర్యుడు, విష్ణువు, శివుడు, అంబ. ఈ అయిదుగురిని పంచాయతన దేవతలు అంటారు. అవి యుగధర్మాన్ని అనుసరించిన ఈ అయిదుగురు సాలగ్రామ శిలలోనే ఉంటారు. దేవతాపూజ చాల గొప్పది. మీరు ఎందుకు దర్శించలేదు' అని చెప్పి–

'ఇక నుండి ప్రతి ఏకాదశికి దేవాలయం దగ్గరలో గల రామగుండంలో స్నానం చేసి ప్రదక్షిణలు చేసి, పూజలు, అభిషేకాలు జరిపించి ఆ దేవతలను సంతానం కోసం ప్రార్థించి, సంతానం కలిగితే ఆ దేవతలలో ఒకరైన జనార్ధనస్వామి విష్ణువు పేరు పెట్టుకొనండి' అని సంతాన గోపాల మంత్రమును ఉపదేశించి వెళ్ళిపోయారు.

వారు స్వామివారు చెప్పినట్లు చేయగా కొంతకాలానికి లీలావతి గర్భవతి అయ్యింది. నవమాసాలు నిండి ఒక కుమారుడు జన్మించాడు. ఆ బాలునికి 'జనార్ధన' అని పేరుపెట్టి అల్లారుముద్దుగా పెంచుకోసాగారు.

సంతానం కోసం దేవుని ప్రార్థించినపుడు మొగ పిల్లవాడు పుడితే వాడికి ఏ వస్తువులు చేయిస్తే మీకు కూడా అవి చేయిస్తాను అని మొక్కుకున్నాడు. కానీ ఆ పిల్లవాడి ఆట పాటలలో మునిగి మరచిపోయారు.

ఆ కుర్రవాడికి రెండు సంవత్సరాలు వచ్చాయి. అప్పటి నుండి ఆ బాలుడు నీరసపడిపోవుట గమనించి, వైద్యులను పిలిపించి చూపించిననూ ఏమి ప్రయోజనం కలుగలేదు. కొంతకాలానికి లీలావతికి తమ మొక్కు గుర్తుకు వచ్చింది.

'ఎంత పాపం చేసినాము. స్వామి వారికి మొక్కులు మొక్కుకుని తీర్చనందుకే ఇలా జరిగింది' అని బాధపడి వెంటనే భర్తతో చెప్పి బాలుడికి చేయించిన నగలు మాదిరిగా బంగారు మువ్వల గజ్జెలు, బంగారు గొలుసులు చేయించి క్షీరారామలింగేశ్వరాలయంలో గల జనార్ధన స్వామికి సమర్పించుకొనగా, ఆ బాలుడికి ఆరోగ్యం కుదుటపడి చక్కగా నుండెను. వారు జనార్ధన స్వామిని సేవించుచూ, భక్తి పారవశ్యముతో ఆనందంగా కాలం గడుపుతున్నారు.

## 3. కుమారారామము (సామర్లకోట)

ఇక్కడి శివలింగము కుమారస్వామిచే ప్రతిష్ఠించబడింది. కనుకనే కుమారారామభీమేశ్వరుడని పేరు కలిగి నాటికి, నేటికి కోరినవారి కోర్కెలు తీర్చే బాలత్రిపుర సుందరీ సమేతంగా అలరారుచున్నది.

ఈ దేవాలయం ప్రాచీన కట్టడం అగుటవల్ల దేశప్రాముఖ్యతను సంతరించుకుంది.

చాళుక్య భీముడు ఈ దేవాలయ నిర్మాణంగావించుటచే ఇక్కడి దేవుడికి చాళుక్య భీమేశ్వర అనే పేరు కలిగింది.

ముఖ్య ఆలయానికి నలువైపులా ద్వితల మండపములు, రెండవ రాతి ప్రాకారానికి ఆనుకుని ఉన్నవి రెండతస్థుల గల ముఖ్య ఆలయం.

చతుప్రాకారపు వేదికపై తొమ్మిది అడుగుల ఎత్తుగా వర్తులాకారపు లింగము ప్రతిష్ఠించబడింది. దీనిపై భాగమున ఉపరితలమండలి గర్భగుడి కనిపిస్తుంది. ఈ గర్భ గుడికి తూర్పు వైపు అంతరాళయ మండపములు గలవు.

దేవాలయమునందు పైన స్థంభము కాకతీయ కాలంనాటి చక్కని శిల్ప సంపదంతా చిత్రీకరింపబడినవి.

స్వామి శుద్ధ స్ఫటికాకారంలో ఉండి భక్తులను బ్రోచుచున్నాడు. ఇక్కడి దేవి బాలా త్రిపుర సుందరీ. సకల విద్యాప్రదాయిని అయిన సరస్వతీ విగ్రహము చూడ ముచ్చటయైనది.





వజ్రగణపతి ఆలయం పడమటి గోడలో అమర్చబడివుంది. పడమటి భాగాన ఏకశిలా స్థంభము కలదు. ఆలయానికి పడమరగా కొంతదూరంలో మాండవ్య నారాయణస్వామి ఆలయం కలదు. ఈ ఆలయ నిర్మాణం విశిష్టతను సంతరించుకుంది.

చైత్ర, వైశాఖమాసములందు సూర్యదేవుని కిరణాలు ఉదయం పూట స్వామి వారి పాదాలను, సాయంత్రం పూట బాల త్రిపుర సుందరీదేవి పాదాలను తాకుతూ పునీతమవుతూ ఉంటాయి.

దేవాలయ ప్రాకారం చుట్టూ కుడ్యస్థంభములు, హంసలబారులు, సింహతలాటాలు, పద్మాలు, కలువ పువ్వుల ఆకృతులతో అలవాలమై శోభిల్లుతుంది.

ఇది భక్తులకు యాత్రా స్థలమైనందున దేశవిదేశాల నుండి భక్తులు వచ్చి అమ్మవారికి కుంకుమ పూజలు, స్వామివారికి అభిషేకాలు చేస్తుంటారు.

## కుమార రామ భీమేశ్వర ఆజ్ఞ

పూర్వం పిఠాపురాన్ని రాజధానిగా చేసుకుని మహేంద్ర చోళుడు పరిపాలిస్తున్నాడు. అతడు గొప్ప శివభక్తుడు. శివుని ఆరాధన జరిపితేగాని ఆహారం ముట్టేవాడు కాదు. రాజకార్యాలు చేపట్టేవాడు కాదు.

ఒకనాడు ఉద్యానవనంలో విహరిస్తుండగా ఒక ఆలోచన కలిగింది. ఆ ప్రకారం మరునాడు కోట బురుజుపై ఒక పెద్ద జయగంటను కట్టించి రాజధానిలోని ప్రజలు ప్రతిరోజూ మూడు పూటలా శివారాధన చేయుటకు శివాలయానికి వెళ్ళాలని వెళ్ళనివారు శిక్షార్హులవుతారని చాటింపు వేయించాడు.

రాజధానిలోని ప్రజలు ఆనందించి ప్రతిరోజూ జయగంట మోగగానే ఎక్కడి పని అక్కడ వదిలేసి ప్రజలు, పిల్లలు, అందరూ శివాలయానికి వెళ్ళి శివుని దర్శించుకుని తరువాత తమ పనులలో నిమగ్నమయ్యేవారు.

ఒకనాడు ఉదయం జయగంట మోగింది. రాజభటులు రాజధానిలో పర్యవేక్షిస్తూ ఉండగా శివయ్య, గౌరమ్మ అనే దంపతులు వానాకాలం సమీపిస్తుందని తాటాకు ఇల్లు నిర్మించుకోటానికి మట్టిని తవ్వి గోడలు కట్టుకుంటున్నారు.

వారిద్దరూ కలిసి భగవన్నామస్మరణ చేస్తూ మట్టి తవ్వుతూ, తట్టలు మోస్తూ జయగంట మోగిన విషయం వినబడక అలాగే పని చేసుకుంటూ ఉండిపోయారు.

అంతలో రాజభటులు అక్కడికి వచ్చి దంపతులిద్దరినీ బంధించి రాజుగారి దర్బారులో ప్రవేశపెట్టి విచారణ చేసారు.

రాజుగారు 'నా ఆజ్ఞను ఎందుకు ధిక్కరించారు?' అని ప్రశ్నించగా– ఆ దంపతులిద్దరూ 'అయ్యా! పని చేసుకునే హడావుడిలో గంట వినబడలేదు. తప్పు క్షమించండి!' అని ప్రాధేయపడ్డా, శాసన ధిక్కారం నేరమేగాబట్టి వారిద్దరికి యవజ్జీవకారాగార శిక్ష విధించారు రాజుగారు.

ఆనాటి రాత్రి కుమారరామ భీమేశ్వరుడు రాజుగారి కలలో కనబడి ఇలా చెప్పాడు 'రాజా! నా భక్తులందరూ ఏ పని చేసినా నన్ను తలచుకుంటూనే చేస్తూ ఉంటారు.

కర్మే నిజమైన భక్తి. మనస్ఫూర్తిగా తన పనిని చేసుకున్నవారే నిజమైన భక్తులు. కావున ఆ దంపతులిద్దరినీ విడిచిపెట్టు' అని ఆజ్ఞాపించాడు.

మరునాడు ఉదయం భటులను పిలిచి 'వారిద్దరినీ విడిచి పెట్టండి. వారికి ఇల్లులేదు కాబట్టి వారికి భవనం కట్టి ఇవ్వండి. ఇంటికి సమీపంలో రెండు ఎకరాలు తోట ఇవ్వండి! అని ఆజ్ఞాపించి ఆనాటి నుండి జయగంట తీసివేసి ప్రజల అవకాశాన్ని బట్టి శివున్ని సేవించుకుని తరించండి అని చాటింపు వేయించాడు.

ఆనాటి నుండి తను కూడా వేళకు శివారాధన చేస్తూ, ధర్మమును పాటిస్తూ సుభిక్షంగా రాజ్యపాలన చేసాడు.

## త్రిపుర సుందరీదేవి అనుగ్రహం

పూర్వం సామర్లకోటను శూరసేన మహారాజు పాలిస్తూ ఉండేవాడు. చుట్టు పక్కల గ్రామ ప్రజల నుండి పన్నులు వసూలు చేస్తూ, సంవత్సరానికొకసారి నైజాం నవాబుగార్కి కప్పం సమర్పించుకుంటూ సామంతరాజుగా ఉంటూ, సుదర్శనుడు అనే మంత్రితో కలిసి పరిపాలన చేస్తున్నాడు.

ఒకనాడు రాజుగారు ఉద్యానవనంలో విహరిస్తుండగా 'ఎన్నాళ్లు ఉన్నా ఇలాగే నడుస్తోంది. ఎంత కాలం గడిచినను అదృష్టం పట్టటంలేదు' అని ఆలోచిస్తూ–అసలు అదృష్టము ఎటువంటి వారిని వరిస్తుంది?' అని అనుకున్నాడు.

మరుసటిరోజు ఉదయం రాజదర్బారులో మంత్రిని పిలిచి అదృష్ట వంతుడు ఎలా ఉంటాడు? అని అడిగాడు.





ఆ ప్రశ్నకు సమాధానం చెప్పలేకపోయాడు మంత్రి. 'నీవు నాకు అదృష్టవంతుడిని చూపాలి. నీకు నెలరోజుల వ్యవధి ఇస్తున్నాను. నాకు చూపకపోతే నీవు ఈ భూమి మీద ఉండే అవకాశంలేదు' అని శాసించాడు.

ఆనాటి నుండి మంత్రి సుదర్శనుడు ఎలా అదృష్టవంతుడిని చూపాలి అని ఆలోచిస్తూ ఇరవై రోజుల కాలం గడిపాడు.

మంత్రి సుదర్శనుడు మంచం పట్టి బెంగతో ఉన్నాడు. అతని భార్య సుందరి భర్త తీరు గమనించి– 'ఏమండీ! ఎందుకు బాధపడుతున్నారు?' అని అడిగింది.

అప్పుడు సుదర్శనుడు 'రాజుగారు అదృష్టవంతుడు ఎలా ఉంటాడో చూపమన్నారు. ఎలా చూపాలి అని ఆలోచిస్తున్నాను. చెప్పకపోతే చంపివేస్తాడట' అని చెప్పాడు.

భర్త అలా చెప్పగానే తాను నిత్యం పూజ చేస్తున్న త్రిపుర సుందరీదేవిని ప్రార్థించింది. ఆమె నిద్రలో ఉన్న సమయంలో కలలో కనిపించి తరుణోపాయం తెలిపింది.

అప్పటికి రెండు రోజుల గడువు మాత్రమే ఉంది. ఆఖరి రోజున భర్తకు ఒక గుమ్మడికాయను ఇచ్చి 'మీరు రాజుగారు అడవికి వెళ్ళి దారికి అడ్డంగా ఈ గుమ్మడికాయను పెట్టండి. ఆ గుమ్మడికాయను ఎవరైతే తీసుకుంటారో వారే ఆ అదృష్టవంతుడని చెప్పండి' అని మంత్రిగారిని రాజువద్దకు పంపింది.

అప్పుడు మంత్రి రాజుగారితో కలసి అడవికి వెళ్ళి ఒక కాలిబాటలో గుమ్మడికాయను పెట్టి పొదల చాటున దాక్కున్నారు.

కొంతసేపటికి ఒక రైతు తన భుజం మీద కావిడి పెట్టుకుని, ఒక తట్టలో ఆనపకాయలు, గుమ్మడికాయలు వేసుకుని, ఇంకొక తట్టలో పాలబిందెపెట్టుకుని ఆ దారి వెంబడే వస్తున్నాడు.

ఆ రైతు దారిలో ఉన్న గుమ్మడికాయను చూసి, 'అసలే ఈ కాయలను మోయలేక చస్తున్నాను మరలా ఇంకొక కాయా!' అని ఆ రైతు గుమ్మడికాయను కాలుతో తన్ని తన దారిన తాను వెళ్ళిపోయాడు.

మరికొంతసేపటికి శివశర్మ అను బ్రాహ్మణుడు నెత్తి మీద ఒక బియ్యం మూట, చంకలో పొట్లకాయలు, భుజం మీద గుమ్మడి కాయను పెట్టుకుని ఆ దారిన వస్తున్నాడు. దారికడ్డంగా ఉన్న గుమ్మడికాయను చూసి 'నెత్తి మీద బియ్యం మూట, భుజం మీద గుమ్మడికాయ, చంకలో పొట్లకాయలను మోయలేక

పోతుంటే ఈ గుమ్మడి కాయ నాకెందుకు' అనుకుని తన దారిన తాను వెళ్ళిపోయాడు.

మంత్రి సుదర్శనుడు ఆ గుమ్మడికాయను తిరిగి యథాస్థానంలో దారికడ్డంగా పెట్టాడు. అలా కొంతసేపు గడచిన తర్వాత ఎవరో గుర్రం మీద ఆ దారినే వస్తూ కనిపించారు.

ఒక రాజకుమారుడు ఆ దారిన బయలుదేరి పక్కరాజ్యంలోకి రాచకార్యమై గుర్రాన్ని ఎక్కి వెళుతున్నాడు. గుర్రం దారికడ్డంగా ఉన్న గుమ్మడి కాయను చూసి ముందుకు వెళ్ళకుండా ఆగిపోయింది.

ఎందుకు గుర్రం వెళ్ళకుండా ఆగిపోయిందో అని గుర్రం దిగి చూసాడు. అక్కడ గుమ్మడికాయ కనిపించింది. దాని ముచికను పట్టుకుని పైకి లేపాడు. బరువుకి ముచిక ఊడి గుమ్మడికాయ కిందపడి పగిలిపోయింది.

ఆ కాయలో నుండి బంగారు ఆభరణాలు, గాజులు, అర వంకీలు, వడ్డాణాలు అన్నీ కిందపడ్డాయి. ఆ రాజకుమారుడు అవన్నీ తీసుకుని తన గుర్రానికి తగిలించిన సంచీలో వేసుకుని వెళ్ళిపోయాడు.

అప్పుడు రాజు ఆశ్చర్యపడి అతడే నిజమైన అదృష్టవంతుడని గ్రహించి మంత్రిగారిని మెచ్చుకుని 'నీకు ఎలా తోచింది ఇలా చెయ్యాలని' అని అడిగాడు.

అందుకు మంత్రి 'మహారాజా! నా భార్యకు బాలత్రిపుర సుందరీదేవి కలలో కనిపించి సలహా ఇవ్వగా ఆమె నాకు చెప్పింది. ఇది నాకు తట్టిన ఆలోచనకాదు. నా భార్య ఇచ్చిన సలహా మేరకు చేసాను' అని చెప్పాడు.

'మీలాంటి ఆదర్శదంపతులు చిరకాలం జీవించాలి. మీలాంటి మంచివారి వలనే మన రాజ్యం సుభిక్షంగా ఉంటుంది' అని మంత్రి సుదర్శనుడిని ఎంతగానో రాజు మెచ్చుకున్నాడు.

ఈ ఆలయాన్ని స్వయంగా కుమారస్వామి ప్రతిష్టించడం వల్ల దీనికి కుమారారామం అని పేరు వచ్చింది.

ఈ దేవాలయానికి పౌరాణిక ప్రశస్తి ఉంది. చారిత్రకంగా క్రీ.శ. 872 నుండి 921 వరకు మొదటి చాళుక్య భీమనృపాలుడు కుమారా రామాన్నే తన రాజధానిగా చేసుకుని రాజ్యపాలన చేసి భీమేశ్వరస్వామిపై అమితమైన భక్తితో ఈ ఆలయానికి సువిశాలమైన ప్రాకార మంటపాలను నిర్మించారు. రాజుగారిపేరు, స్వామి పేరు కలసి ఈ ప్రాంతం చాళుక్య భీమేశ్వరంగా ప్రసిద్ధి చెందింది.





సామర్ల కోటలోని ఆలయం, ద్రాక్షారామ భీమేశ్వర ఆలయాలు రెండూ ఒకే విధమైన నిర్మాణ శైలిలో కనిపిస్తాయి.

దేవాలయం రాతితో కట్టిన రెండు ప్రాకారాల మధ్య రెండతస్తుల ప్రధాన ఆలయం నిర్మించబడివుంది. కుమారారామ భీమేశ్వరస్వామి వారి దేవేరి బాలత్రిపుర సుందరీదేవి.

క్రీ.శ. 1447 నుండి 1494 వరకు గల మధ్యకాలంలో జారీచేసిన ముప్పై ఒక్క శాసనాలు ఈ దేవాలయంలో ఉన్నాయి.

ఇవన్నీ కూడా దాన శాసనాలే. వీటిని కొన్నిటిని బట్టి తూర్పున ఉన్న ముఖ మంటప నిర్మాణం క్రీ.శ. 1394 లోనూ, నిలువు మంటపాలు క్రీ.శ. 1422 లోనూ నిర్మించినట్లు తెలుస్తుంది.

ఈ దేవాలయం తూర్పుగోదావరి జిల్లాలోని సామర్లకోటకు ఒక కిలోమీటరు దూరంలో ఉంది. దేవతలందరూ ఈ స్వామిని నిత్యం ఆరాధిస్తుంటారు. అందుకు సాక్షిగా ఆలయం చుట్టూ ప్రధాన దేవతలు కొలువై ఉన్నారు.

## 4. దాక్షారామము (ద్రాక్షారం)

ఈ గ్రామం పేరు దక్షారామము, అనగా దక్షస్యభవనా రామదక్షారామ, అనగా నవబ్రహ్మలలో ఒక బ్రహ్మ అయి ఈశ్వరునికి మామగారైన దక్ష ప్రజాపతి యొక్క ఆరామమే దక్షారామము.

ఇక్కడ అగస్త్యమహాముని, సప్తఋషులు మొదలగువారు నివాసము ఉండి తపస్సు చేసుకునేవారు.

ఈ పవిత్రస్థలమందు శివలింగాన్ని ప్రతిష్ఠింపవలెనని సప్త ఋషులు నిర్ణయించుకుని తీసుకుని వచ్చారు.

ఈ ప్రదేశమునందు నదిలేని కారణంగా రాజమహేంద్రవరము నుండి గోదావరి నదిని తీసుకురావాలని తలచి, గోదావరి మాతను ప్రార్థించగా, గోదావరి మాత అంగీకరించి వస్తూ ఉండగా మార్గ మధ్యమున తుల్య మహర్షి యొక్క యజ్ఞ వాటిక, ఆశ్రమాలు కొట్టుకొనిపోగా అతడు శపించెను.

ఈ కార్యక్రమం భగవంతుడి సౌకర్యార్థం ఉపయోగిస్తున్నందున ఇది తమ అపరాధము కాదని ప్రతి శాపము ఇవ్వబోగా గోదావరి మాత సాక్షాత్కరించి ఇరువురిని శాంతపరచి తను అంతర్వాహినిగా ఈ గ్రామం రావటానికి నిశ్చయించింది.

గోదావరి నది వచ్చేసరికి శ్రీ స్వామివారు ప్రతిష్ఠింపబడి ప్రధమార్చన కూడా జరిపినట్లుండం చూసి ఋషులు ఆశ్చర్యపోయి లోనకు వెళ్ళుటకు ప్రయత్నించగా గర్భగుడి అంతయూ వేడిగా ఉండటం చూసి నివ్వెరపోయి ఉన్న సమయాన అదృశ్యవాణి 'ఈ శకలం స్వయంగా ప్రతిష్ఠింపబడెను.

దేవతా ప్రీతి కొరకు సూర్యభగవానుడు ప్రధమార్చన జరిపాడు. కావున ఆ వేడి తగ్గుటకు ఈ గ్రామానికి ఎనిమిది సోమలింగములు ప్రతిష్ఠించినచో ఈ వేడి తగ్గుతుంది' అని పలికింది.

అంతట ఋషులు ఎనిమిది దిక్కులా ఎనిమిది సోమలింగాలను ప్రతిష్ఠింపజేసారు. అవే అష్ట సోమేశ్వరములు అని ఇప్పటికీ చెబుతారు.

ఈ నదిని ఋషులుచే తీసుకొచ్చినది కావున సప్తగోదావరి అని పేరు వచ్చినది. ఇదియే దక్షారామము.

## అష్ట సోమేశ్వరములు

| | |
|---|---|
| తూర్పు | : కోలంక అనే గ్రామం సూర్యుడు ప్రతిష్ఠించెను. |
| ఆగ్నేయం | : దంగేరు అనే గ్రామం కశ్యప మహర్షి ప్రతిష్ఠించెను. |
| దక్షిణం | : కోటిపల్లి అనే గ్రామం అత్రిమహర్షి ప్రతిష్ఠించెను. |
| నైఋతి | : కోరుమిల్లి అనే గ్రామం భరద్వాజ మహర్షి ప్రతిష్ఠించెను. |
| పడమర | : వెంటూరు అనే గ్రామం విశ్వామిత్ర మహర్షి ప్రతిష్ఠించెను. |
| వాయవ్యం | : సోమేశ్వరం అనే గ్రామం గౌతమ మహర్షి ప్రతిష్ఠించెను. |
| ఉత్తరం | : వెల్ల అనే గ్రామం వశిష్ఠ మహర్షి ప్రతిష్ఠించెను. |
| ఈశాన్యం | : పెనుమళ్ళ అనే గ్రామం జమదగ్ని మహర్షి ప్రతిష్ఠించెను. |

ఇక్కడ దక్షయజ్ఞం జరిగింది. అందువలననే ఈ గ్రామానికి దక్షవాటిక, దక్షారామము అని పేర్లు వచ్చాయి.

దక్షప్రజాపతికి చాలా మంది కుమార్తెలు ఉన్నారు. అతని నివాసం దక్షారామం. అతని కుమార్తెలలో సతీదేవిని ఈశ్వరునికి ఇచ్చి వివాహము చేసాడు.

ఇలా కొంతకాలమునకు దక్షుడు యజ్ఞం చేయ సంకల్పించి, అల్లుడైన ఈశ్వరుని పిలవడానికి కైలాసానికి రాగా ఈశ్వరుడు సమాధియందు ఉన్నందున పలుకరించలేదు. అందుకు కోపించిన దక్షుడు నిరీశ్వరయాగము (ఈశ్వరుడు లేకుండా) చేయుటకు పూనుకున్నాడు. ఆ యాగానికి ఆకాశమార్గమున దేవతలందరూ వెళుతుండగా సతీదేవి చూసి విషయం తెలుసుకుంది.





ఆ యాగానికి తాను కూడా వెళతానని ఈశ్వరుని అనుజ్ఞకోరగా వెళ్ళవద్దు అని చెప్పిననూ ఈశ్వరుని మాట నిరాకరించి, తన పుట్టింటి మీద గల ప్రేమతో బయలుదేరి వెళ్ళింది.

యాగశాల యందు ఉన్న వారెవరూ తనను పలకరించక పోవుట చేత బాధపడి, తిరిగి ఈశ్వరుడికి తన ముఖాన్ని చూపలేక యోగాగ్ని సృష్ఠించుకుని తన దేహాన్ని దహింపజేసుకుంది.

ఆ విషయం ప్రధమగణముల ద్వారా తెలుసుకున్న ఈశ్వరుడు ప్రళయకాల రుద్రుడై తన జటను పెరికి నేలపై కొట్టగా వీరభద్రుడు అవతరించాడు. అంత వీరభద్రుడు ఈశ్వరుని ఆనతి ప్రకారం దక్షుని యాగం ధ్వంసంచేసి, దక్షుడిని సంహరించాడు.

ఆ సందర్భంగా అడ్డువచ్చిన శ్రీమహావిష్ణువు చక్రాన్ని నమిలివేసి, సూర్యుని పండ్లు ఊడగొట్టి తిరిగి వస్తున్నంతలో సమస్త దేవతలు ఈశ్వరున్ని ప్రార్థింప, ఈశ్వరుడు కరుణించి దక్షుని మొండెమునకు గొర్రె తలను అతికించి బ్రతికించాడు. మహావిష్ణువు చక్రాన్ని కూడా ప్రసాదించి కైలాసానికి వెళ్ళాడు.

యాగశాలనందు దేహత్యాగము చేసిన సతీదేవి శరీరంను ఈశ్వరుడు వియోగము వలన తన భుజంపై వేసుకుని విలయతాండవ నృత్యం చేయగా ముల్లోకాలు కంపించింది.

దేవతల యొక్క ప్రార్థనతో శ్రీ మహావిష్ణువు తన చక్రాయుధంతో ఆ మృతదేహాన్ని పదునెనిమిది ఖండాలుగా ఖండించగా అవి పదునెనిమిది దివ్యస్థలముల యందు పడి మహాపీఠాలై విరాజిల్లుతున్నవి. అవే అష్టాదశ పీఠాలుగా చెప్పబడుచున్నవి. అందులోని పన్నెండవ పీఠంగా ఇక్కడ శ్రీ మాణిక్యాంబాదేవిగా వెలసింది.

ఈ దేవికి శరన్నవరాత్రోత్సవములు తొమ్మిది రోజులు అమ్మవారికి కుంకుమ పూజలతో అత్యంత వైభవోపేతముగా జరుగుతాయి.

సంగీత, సాహిత్య, ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమములు కనుల మనోజ్ఞరసభరితంగా నిర్వర్తిస్తారు.

ఈ దేవాలయం ఎత్తయిన రాతిగోడల ప్రహారీతో నాలుగు దిక్కులా నాలుగు రాజగోపురాలతో, అయిదు ప్రాకారాల మధ్యన ఉన్నది.

ప్రథమ ప్రాకారమున కొబ్బరితోట యందు నైఋతి భాగాన మంగళవార మండపం. వాయువ్య భాగాన డెబ్బై స్థంభములతో సోమవార మండపం,

ఈశాన్యభాగాన రుద్ర తీర్థము, కాళభైరవుడు, అష్టభైరవులు, తూర్పు భాగాన శంకర నారాయణ స్వామివారి అశ్వద్ధ వృక్షము, నందీశ్వరుడు, ధ్వజస్థంభము, దక్షిణ భాగాన శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి మరియు మేథా దక్షిణామూర్తి ఆలయాలు కనబడతాయి.

ప్రధాన ద్వారానికి దక్షిణంగా తాండవ గణపతి, డుండి గణపతి ఉన్నారు. రెండవ ప్రాకారంలో తిరుచుట్టు మాలికయందు వరుసగా ఆంజనేయస్వామి, శ్రీ రాముడిచే ప్రతిష్ఠింపబడిన క్షేత్రపాలకులు అయిన లక్ష్మీనారాయణస్వామి, హంపీ విరూపాక్షాలయం, నటరాజస్వామి, సప్త మాతృకలు, నమూనా దేవాలయం, సుబ్రహ్మణ్యేశ్వరుడు, మహిషాసుర మర్ధని దేవి, చండీశ్వరస్వామి, దేవేరి శ్రీమాణిక్యాంబ, నవగ్రహ, అష్టాదిక్పాలక మండపములు, శ్రీ వీరభద్రేశ్వరాలయం, వటుక భైరవుడు, లక్ష్మీ గణపతి, కాకులేశ్వరుడు, చతుర్ముఖ బ్రహ్మలు కనిపిస్తారు.

స్వామి వార్ల ప్రధాన ఆలయానికి దిగువ భాగాన శ్రీ సూరేశ్వరస్వామి, శ్రీ దుర్గాదేవి, శ్రీ ఆంజనేయస్వామి, భీమసభ ఉన్నాయి.

వీటి మధ్య నుండి శ్రీ స్వామివార్ల మూలవిరాట్ (చీకటి కోణము)నకు దారి ఉంది. ఈ దారి గుండా మూడవ ప్రాకారములోనికి ప్రవేశించవచ్చును. ఈ ప్రాకారమునందు ఉత్తర భాగాన శంకుస్థాపన స్థంభము, పైన ఆదిశేషుని ప్రతిమ చూడవచ్చు.

నాలుగవ ప్రాకారమున విశేషములు ఏమీ కనబడవు. అయిదవ ప్రాకారములో శ్రీస్వామివారి గర్భగృహం ఉంది. అందులో ఎత్తయిన త్రిపీఠంలో పది అడుగుల ఎత్తయిన తెల్లటి స్ఫటిక లింగము, దానిపైన పులిచర్మధారియైన భీమశంకరుడు కళ్ళకు మనోహరంగా కనబడతాడు.

పైన రెండవ అంతస్తునందు తూర్పు భాగాన ఆగ్నేయముగా కైలాసగణపతి, ఈశాన్య భాగాన పంచలోహ నటరాజ పార్వతీ విగ్రహాలు గల మందిరం ఉన్నాయి. ప్రదక్షణ మండపమునందు దక్షిణం వైపుగా నైఋతి భాగాన ఒక రాతిస్థంభము మీద వేద వ్యాసులవారు కనబడతారు.

అంతరాలయంలో శ్రీపార్వతీదేవి, శ్రీ ఉత్సవ మూర్తులను చూడవచ్చు. గర్భాలయంలో మూడు విశాలమైన కిటికీలతో కిందనుండి పైకి వస్తే సుమారు నాలుగు అడుగుల శ్రీ భీమేశ్వరుడు, పక్కన సతీదేవి ప్రతిష్ఠించబడి ఉండును. ముఖ మండపము నందు నందీశ్వరుడు కనబడతారు.





ద్రాక్షారామం ఒకప్పుడు బౌద్ధారామంగా ఉండేదని విష్ణుకుండినుల కాలంలో శైవక్షేత్రంగా వెలసిందని, చాళక్యుల ఏలుబడిలో బహువిధాలుగా ప్రశస్తి పొందిందని తెలుస్తుంది.

క్రీ.శ. పధ్నాల్గవ శతాబ్దమున రెడ్డి రాజుల కాలంలో విరాజిల్లినదని శాసనాల ద్వారా తెలియవస్తుంది.

నాలుగవ రాజగోపురం అనవేమారెడ్డి కాలంలో కట్టినట్లు తెలుస్తుంది. ఈ ఆలయ పరిరక్షణ కేంద్ర ప్రభుత్వం వారి రక్షణలో ఉంది.

ఈ ఆలయప్రాశస్యము గుర్తించి వేలాది మంది భక్తులు కార్తీకమాసంలో వచ్చి శ్రీస్వామివార్లకు అభిషేకాలు, శ్రీమాణిక్యాంబ దేవికి కుంకుమార్చనలు చేస్తుంటారు.

శ్రీస్వామివారి జన్మదినోత్సవం మార్గశిర శుద్ధ చతుర్ధశినాడు కనుల విందుగా జరుగుతుంది.

ఏకాదశి రోజున అంటే మాఘశుద్ధ ఏకాదశి రోజున శ్రీస్వామి వార్లకు శ్రీ లక్ష్మీనారాయణ స్వామి వారికి, శ్రీ సూర్యేశ్వరస్వామి వారికి ధ్వజారోహణ, కళ్యాణ ఉత్సవాలు జరుగుతాయి.

మూడవ రోజున పొన్నవాహన ఉత్సవం, నాలుగవ రోజున రథోత్సవము, అయిదవ రోజున శ్రీత్రిశూల చక్రస్నాన, తెప్పోత్సవములు జరుగుతాయి.

త్రేతాయుగమున శ్రీరామచంద్రుడు, ద్వాపర యుగమున అర్జునుడు దర్శించినట్లుగా శ్రీనాధుడు రాసిన భీమేశ్వర మహాత్యంనందు కలదు.

ఈ దేవాలయ ప్రాకారగోడలపై సుమారు ఎనిమిది వందల శాసనాలు ఉన్నాయి. ఈ ఆలయం క్రీ.శ. 14వ శతాబ్దంలో రెడ్డిరాజుల కాలం నుండి అత్యంత వైభవముతో విలసిల్లుతున్నది.

దక్ష వాటికకు పడమర ద్వారమున గోగులమ్మ, తూర్పున నూకాలంబ, ఉత్తరాన మూకాంబిక, దక్షిణాన ఘట్టాంబిక కొలువుదీరి ఉన్నారు.

ఇంద్రుడు దక్షారామమున శివుని లింగమును పూజించి కోరిన కోరికలు తీర్చుకొనెను.

ఇంద్రుడిని ఆదర్శంగా తీసుకుని దేవతలు, దిక్పాలురు శివలింగమును తాము కూడా పూజించి తరించారు.

అనాచారపరుడైనా, ఆచారపరుడైనా భక్తి శ్రద్ధలతో సేవించినవారికి ముక్తి లభిస్తుంది.

సప్తగోదావరి నందు గల నీటితో శ్రీమాణిక్యాంబ సమేత దక్షారామ భీమేశ్వరస్వామిని అభిషేకించి, అమ్మవారికి కుంకుమార్చన జరిపితే బ్రహ్మహత్యపాతకం పోయి విముక్తులు అవుతారని పురాణగ్రంథాలు చెబుతున్నాయి.

## 5. సోమారామము (భీమవరం)

ఈ లింగాన్ని చంద్రుడు ప్రతిష్ఠించుట చేత ఈ లింగానికి సోమేశ్వరలింగమని నామకరణం జరిగింది.

ఈ లింగము అమావాస్యరోజున గోధుమ వర్ణంతోను, పౌర్ణమినాడు శుద్ధస్ఫటిక వర్ణంగాను రంగు మారుతుంటుంది.

ఈ ఈశ్వరలింగం గర్భాలయం పైభాగమున అన్నపూర్ణ అమ్మవారి విగ్రహం ఉండడం ఈ సోమారామం యొక్క ప్రత్యేకత. గంగను శిరస్సుపై ధరించాడని ప్రతీకగా నిర్మించారని అంటారు.

దగ్గరలోని దర్శనీయ స్థలాలు : భీమవరంలోనే సువిశాలమైన ఉమాభీమేశ్వర ఆలయం ఉంది. ఇక్కడ కూడా పండుగ రోజులలో భీమేశ్వరస్వామి పూజలందుకొనుచున్నాడు.

ఈ దేవాలయాన్ని చాళుక్యభీముడు నిర్మిచటం వలన భీమవరం అనే పేరు ఏర్పడింది.

భీమవరం ఊరి మధ్యలో వరాల తల్లిగా మావుళ్ళమ్మతల్లి ఉగ్రరూపంతో ఎనిమిది అడుగుల ఎత్తు కలిగిన విగ్రహం ఉంటుంది. చరిత్ర ఆధారాలను బట్టి సుమారు ఆరువందల సంవత్సరాల నుండి మహిమలు గల తల్లిగా ఆరాధింపబడుతుంది.

ప్రతి శుక్రవారం వేలాది భక్తులు అమ్మవార్ని దర్శించి కానుకలు సమర్పిస్తారు. జ్యేష్ఠమాసంలో అమ్మవారి జాతర నిర్వహిస్తారు.

ఈ సోమారామము దేవాలయానికి జనార్ధనస్వామి క్షేత్రపాలకుడగుట చేత ప్రతి ఏటా వివాహాలు జరుగుతాయి. ఇక్కడ వివాహం చేసుకుంటే వివాహ జీవితం సుఖమయం అవుతుందని భక్తుల నమ్మకం.

ఈ దేవాలయంలో ఆంజనేయస్వామి, కుమారస్వామి, నవగ్రహ ఆలయాలు ఉన్నాయి. గాలిగోపురానికి ఇరువైపులా సూర్యభగవానుడు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రతిష్ఠించబడ్డారు.





దేవాలయానికి తూర్పువైపున చంద్ర పుష్కరిణి ఉంది. దీనినే సోమగుండం అంటారు.

మరియొక విశేషమేమనగా దేవాలయానికి ఎదురుగా పదిహేను అడుగుల ధ్వజస్థంభం ఉంది. అందులో నందీశ్వరుడు ఆసీనుడై చూసే వాళ్ళకు ఆనందం కలిగిస్తుంటాడు.

క్షీరారామలింగేశ్వర లింగం వలె సోమేశ్వర లింగం పీఠం నుండి రెండు అడుగుల ఎత్తు ఉంటుంది. ఇది స్ఫటిక లింగం. ఈ లింగం చంద్రుని వృద్ధి క్షయమువలె రంగు మారుతూ ఉంటుంది.

గర్భాలయంలో సోమేశ్వరస్వామి, ఉత్తరం వైపు పార్వతీ అమ్మవారు, విఘ్నేశ్వరుడు, నంది, తూర్పువైపు ఏడు అంతస్తుల గాలి గోపురం. ఈశాన్యం వైపు నవగ్రహ దేవాలయం, ఉత్తరం వైపు ఆంజనేయస్వామి. పడమర వైపున జనార్ధన స్వామి ఆలయం. దక్షిణం వైపు సూర్యభగవానుడు. ఆగ్నేయం వైపు ఆదిలక్ష్మి దేవాలయాలు ఉన్నాయి.

పై అంతస్థులో సుమారు నాలుగు అడుగుల ఎత్తులో అన్నపూర్ణ అమ్మవారు అభయ హస్త ముద్రతో వెలుగుతూ భక్తుల కోర్కెలు తీర్చే వరాల తల్లిగా భాసిల్లుతూ ఉన్నది.

ఈశ్వరుడిని శర్వ, రుద్ర, భవ, ఉగ్ర, పశుపతి, భీమ, ఈశాన, మహాదేవ అనే పేర్లతో పిలుస్తారు. అందుకే ఆయన్ని అష్టమూర్తి అనే పేరు కలదు.

ఈశ్వరుని అష్టమూర్తి అవతారాలను గురించి శివమహాపురాణం, శతరుద్ర సంహితలలో వివరించబడింది.

అష్టమూర్తులు :

1. శర్వుడు : ప్రళయ కాలమున ప్రాణులను హింసించువాడు.
2. రుద్రుడు : దుఃఖాన్ని, దుఃఖకారణాన్ని పోగొట్టువాడు. ప్రపంచాన్ని ప్రకాశింపజేసే అగ్నిపై నిలిచి ఉంటాడు.
3. భవుడు : ఎల్లకాలమునందును ప్రాణులను ఆశ్రయించి ఉండేవాడు.
4. ఉగ్రుడు : ప్రపంచాన్ని మించి ఉండేవాడు. అంతటా బాహ్య వాయువులందు నిలిచి ఉంటాడు.
5. పశుపతి : సంసారంతో కూడిన జీవులను బంధవిముక్తులను కలుగ జేయువాడు. క్షేత్రజ్ఞుడైన జీవాత్మలో నివశించి ఉంటాడు.
6. భీముడు : భయంకర స్వరూపం కలిగి ఉంటాడు. ఆకాశాన్ని పొంది ఉంటాడు.

7. ఈశానుడు : చరాచర జీవులను శాసించువాడు. జగానికి నేత్రం వంటి సూర్యనిలో ప్రకాశిస్తూ ఉంటాడు.

8. మహాదేవుడు : దేవతలందరిచేత పూజింపబడువాడు. అమృత కిరణాలచే చరాచరప్రాణులను పెంపొందించే చంద్రునిలో వెలుగొందుతాడు.

## శ్రీ సోమేశ్వరస్వామి మహిమలు

పదవ శతాబ్దంలో తూర్పు చాళుక్య రాజు జనరంజకంగా పరిపాలన చేస్తున్నాడు. ఆయనకు రాజ చోళుడు అనే కుమారుడు ఉన్నాడు. విద్యాభ్యాసం కోసం శంకర శాస్త్రి అనే పండితుడి దగ్గర చేర్పించాడు.

రాజచోళుడికి అవసరమైన విద్యలన్నీ పండితుడు నేర్పించాడు. చాళుక్య రాజు తన మాదిరిగా తన కుమారుడు కూడా దైవ భక్తి పరుడై మంచి నడవడిక కలవాడై కీర్తి ప్రతిష్ఠలు పొందాలని కోరుకునేవాడు.

రాజచోళుడు విద్యావంతుడు అయ్యాడుగాని దైవభక్తి పరుడుకాలేదు. అందుకు ఎంతో విచారించి ఎంతమందిచేత చెప్పించినా రాకుమారుని మార్చలేకపోయారు.

ఒకరోజు హిమాలయాల నుండి తపస్సు ముగించుకుని ఒక స్వాములవారు ఆ రాజ్యము గుండా ప్రయాణం చేస్తుండగా ఆ విషయాన్ని రాజుగారికి చెప్పారు. రాజు ఆయన్ని తన ఆస్థానానికి రప్పించి సత్కరించాడు.

రాజ చోళుడు ఆ స్వామిని చూసి ఇటువంటి వారందరూ కపట సన్యాసులు, బాధ్యతా రహితులు, వీరిని సత్కరించడం మహాపాపం అని నిందించాడు. వెంటనే నోట మాట రాకుండా ఆగిపోయింది.

చాళుక్యరాజు స్వాములవారితో 'అయ్యా! నా పుత్రుడు మిమ్మల్ని నిందించాడు. అతని తరఫున నేను క్షమించమని అడుగుతున్నాను. అతని తప్పును మన్నించి యథాస్థితికి వచ్చేటట్లు చేయండి' అని ప్రార్థించాడు.

అప్పుడు స్వాములవారు 'రాజా! నేను అతనిని ఏమీ అనలేదు. అతనిని భగవంతుడే శిక్షించాడు. చేసిన పాపానికి తగిన ఫలము అనుభవించవలసిందే' అని చెప్పి వెళ్ళిపోయాడు.

రాజు మంత్రితో కలసి ఆలోచించగా మంత్రి పుణ్యనదులలో స్నానమాడి తీర్థయాత్రలు చేస్తే తిరిగి మాటలు వస్తాయని చెప్పగా ఆ మాటలు యువరాజు





విని ఒకనాడు కోటను వదలి అడవి మార్గం పట్టాడు. అతడు అడవిలో చాలా దూరం ప్రయాణం చేసి, చీకటి పడే వేళకు ఒక మర్రి చెట్టును చేరుకుని విశ్రాంతి తీసుకుంటూ నిద్రపోయాడు. ఆ సమయంలో ఎక్కడినుండో ఓం అనే శబ్దం వినిపిస్తోంది. యువరాజు మేల్కొని చూడగా అక్కడ ఎవరూ లేరు. ఆ శబ్దం ఎటునుండి వస్తుందో అని చూసాడు.

ఆ శబ్దం చెట్టు తొర్రలో నుండి వస్తోందని తెలిసి తొర్రలోకి చూస్తే అక్కడ ఒక సాధువు తపస్సు చేస్తున్నాడు. ఆయన పాదాల మీద పడి నోటమాటరాక ఒక ఆకు మీద పుల్లతో 'నాకు భగవానుని దర్శనం కావాలి! మీకు శిష్యుడిగా ఉండి సేవ చేస్తాను!' అని రాసి చూపించాడు.

ఓంకార స్వాములవారు అది చదివి సరేనని సమ్మతించే ముందు 'నేను ఎలా చెపితే అలా చేయాలి. నేను ఎక్కడ ఏం చేసినా మాట్లాడకూడదు' అని చెప్పగా యువరాజు అంగీకరించాడు. స్వామివారు చెట్టు దిగి అడవిలోకి బయలు దేరాడు. యువరాజు కూడా వెనక నడుస్తూ దట్టమైన అడవిలోకి చేరే సరికి చీకటి పడింది.

అక్కడికి కొంతదూరంలో ఒక గ్రామం ఉంది. అక్కడి నుండి దీపకాంతి వస్తుందని అక్కడకు వెళ్ళగా అక్కడ ఒక బోయవాడు చెట్టుపైన పక్క వేసుకుని ఉన్నాడు. అతడు ఒక చెంబుతో ఆవుపాలు తాగబోతున్నాడు.

అంతలో స్వాములవారు, యువరాజు అక్కడకు వెళ్ళి 'మాకు ఆకలిగా ఉంది' అనగానే ఆ బోయవాడు ఆ చెంబులోని పాలు కొంత యువరాజుకిచ్చి మిగతావి స్వాముల వారికిచ్చాడు. వారిద్దరూ ఆ పాలు తాగి ఆ రాత్రి అక్కడనే విశ్రమించారు. తెల్లవారి వారిద్దరూ లేచేసరికి ఆ బోయవాడు అక్కడలేడు.

అతన్ని ఏ క్రూరమృగమో తినేసి ఉంటుందని అనుకుని వారిద్దరూ అక్కడి నుండి బయలుదేరి కోసల రాజ్యం చేరుకున్నారు. ఆ రాజుగారికి ఒక కుమారుడు కలిగి సంవత్సరం నిండినది. పుట్టినరోజు పండుగ వచ్చింది.

ఎక్కడెక్కడి నుండో శాస్త్రజ్ఞులు, సాధువులు వచ్చి బిడ్డను ఆశీర్వదించి రాజుగారు ఇచ్చిన ధోవతులు తీసుకు వెళ్తున్నారు. రాజభటులు ఊరి వెలుపల వున్న ఓంకారస్వాముల వారిని, యువరాజుని చూసి రాజ భవనానికి తీసుకెళ్ళారు. వారిద్దరూ రెండవ అంతస్థులో ఉన్న బిడ్డను ఆశీర్వదించి, బిడ్డను భుజం మీద వేసుకుని పైన కాషాయ వస్త్రం కప్పి గ్రామానికి దూరంగా ఉన్న మఠానికి చేరుకున్నారు.

ఇంతలో ఉయ్యాలలో బిడ్డ లేడు ఎవరో ఎత్తుకు పోయారని రాజభటులను నలు దిక్కులా పంపగా మఠంలో ఓంకార స్వాముల వద్ద బాలుడు నిద్రపోవుట గమనించి రాజభటులు స్వాములవారిని బంధించి తీసుకుపోయారు.

అంతకు ముందే రాకుమారుడు స్వాములవారిని నిందించి ఈ పాపపు పనులు నేను చూడలేను. ఇక నీ దారి నీది. నా దారి నాది అని వెళ్ళిపోయాడు.

అక్కడి నుండి హిమాలయాలకు వెళ్ళి స్వాములవారు చెప్పిన మంత్రాన్ని జపిస్తూ ధ్యానంలో మునిగాడు. కొంతకాలానికి దివ్యతేజస్సుతో ఒక బ్రాహ్మణుడు దర్శనమిచ్చి 'నీవు చేసిన తపస్సు ఫలించింది. నీవు జల్లిసీమలో గునుపూడి అనే చోట సోమారామము కలదు. అక్కడికి వెళ్ళి చంద్ర పుష్కరిణిలో స్నానం చేసి అన్నపూర్ణ సమేత సోమేశ్వరుడిని కొలిచితే నీకు మాటలు వస్తాయి' అని చెప్పాడు.

అప్పుడు యువరాజు సోమారామము చేరుకుని పుష్కరిణిలో స్నానం చేసి యధావిధిగా అభిషేకం చేసి మూడోసారి ప్రదక్షిణం చేస్తుండగా అతనికి మాటలు వచ్చాయి. ఆనందంతో తండ్రి గారి రాజ్యమునకు వెళ్ళి విషయమంతా చెప్పాడు.

మహారాజు పరమానందభరితుడై యువరాజుని పట్టాభిషిక్తుడిని చేసి తాను వానప్రస్థాశ్రమం చేరుకున్నాడు.

ఆ సమయంలో కోసల దేశమును పాలించు భూపాలుడి నుంచి ఒక కబురు వచ్చింది. అందరు రాకుమారులు మా అమ్మాయి వివాహం కొరకు వస్తున్నారు. మారు కూడా వచ్చి స్వయంవరంలో పాల్గొనవలసిందిగా వర్తమానం వచ్చింది.

రాకుమారుడు కోసల రాజ్యం చేరుకున్నాడు. అక్కడ ఒకరోజున ఓంకార స్వాముల వారిని తీసుకుని వచ్చి దర్బారులో విచారణ జరుపుతున్నారు.

అప్పుడు రాకుమారుడు స్వాములవారిని చూసి తన మనసులో మెదలుతున్న విషయాలను అడిగి తెలుసుకోవాలని రాజుగారి వద్ద అనుమతి తీసుకుని స్వాముల వారిని ప్రశ్నించడం మొదలు పెట్టాడు.

'రాజుగారి కుమారుడిని మీరు దొంగిలించి మఠానికి ఎందుకు తీసుకురావలసి వచ్చింది?' అని అడిగాడు.

'రాజు భార్య అహర్నిశలు నా ధ్యానం చేస్తూ కుమారుడు పుట్టాలని పూజలు చేస్తూ ఉండేవారు. కుమారుడు కలిగిన తరువాత అతడి ఆటపాటలలో





పడి నన్ను పూజించడం మానివేశారు. అందుకనే వారి బిడ్డను తీసుకుని వచ్చాను. తిరిగి వారికి బిడ్డ దొరికిన తర్వాత జ్ఞానోదయం కలిగి అప్పటి నుండి అహర్నిశలు యధాతదంగా శివ పూజలు చేస్తున్నారు.

ఇంక నీవు పత్రం మీద వ్రాసిన విధంగా భగవానుడి దర్శనం కావాలని కోరావు, ఇదిగో నా నిజ స్వరూపము చూపుతున్నాను' అని సోమేశ్వర స్వామి ప్రత్యక్షమయ్యారు.

'భక్తులారా! ఓంకార స్వాములుగా నా మహిమలు చూపాను. భూపాల రాజా! నీ కుమార్తెను ఈ రాజచోళునికి ఇచ్చి వివాహం జరిపించు. మీకందరకు మేలు కలుగుతుంది' అని చెప్పి అంతర్ధాన మయ్యారు.

అప్పటి నుండి రాజచోళుడు అష్ట ఐశ్వర్యములతో, దైవభక్తితో ఉన్నాడు.

## ఈశ్వరుని పంచముఖాలు

1. అఘోర రూపము – అమరారామం – అమరావతి – గుంటూరు జిల్లా.
2. తత్పురుష రూపము – ద్రాక్షారామం – ద్రాక్షారం – తూర్పుగోదావరి జిల్లా.
3. వామదేవ రూపము – కుమారారామం – సామర్లకోట – తూర్పుగోదావరి జిల్లా.
4. సద్యోజాత రూపము – సోమారామం – భీమవరం – పశ్చిమగోదావరి జిల్లా.
5. ఈశాన రూపము – క్షీరారామం – పాలకొల్లు – పశ్చిమ గోదావరి జిల్లా.

1. అఘోర రూపం : ఘోరముకాని, శాంతి రూపము.
2. తత్పురుష రూపం : ఆత్మ స్వరూపము.
3. వామదేవ రూపం : సత్యమైనది సుందరమైన స్వరూపము.
4. సద్యోజాత రూపం : నిత్య నూతనమైన రూపము.
5. ఈశాన రూపం : లోకమంతా తానై నిండి ఉండునది.

ఈ భావస్ఫోరకముగా పంచారామాలు ఏర్పడినవి.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

# అష్టాదశ శక్తి పీఠాలు

ఈ సర్వసృష్టికి మూల రూపిణి ఆది పరాశక్తి. ఆమె పాదధూళి నుండే ఈ బ్రహ్మాండం, చెట్లు, చేమలు, జీవరాశి, పర్వతాలు, నదులు మొదలైనవి సమస్తం ఆవిర్భవించాయి.

ఈ సృష్టి అంతా ఆమె స్వరూపమే. సృష్టి, స్థితిలయలు సర్వం జగదేశ్వరిమహిమే.

అఖండ భారతదేశంలో భూభాగాన 108 శక్తి పీఠాలు వెలిశాయి. వీటిలో 18 మహాశక్తి పీఠాలు, 51 శక్తి పీఠాలు మిగిలినవి ఉపశక్తి పీఠాలుగా ప్రసిద్ధి చెందాయి. మహాశక్తి పీఠాలును అష్టాదశ శక్తి పీఠాలుగా పిలుస్తారు.

వీటిలో మొదటిది శ్రీలంకలో ఉండగా, మిగిలిన 17 మహాశక్తి పీఠాలు భారతదేశంలోనే ఉన్నాయి. దక్షిణ భారతదేశంలో 6 మహాశక్తిపీఠాలు, ఉత్తర భారతదేశంలో 11 మహాశక్తి పీఠాలు ఉన్నాయి.

*లంకాయాం శాంకరీదేవి - కామాక్షీ కాంచి కాపురే*
*ప్రద్యుమ్నే శృంఖలాదేవీ - చాముండీ క్రౌంచ పట్టణే।*
*అలంపురీ జోగులాంబా - శ్రీశైలే భ్రమరాంబికా*
*కొల్హపురే మహాలక్ష్మీ - మహుర్యే ఏకవీరికా॥*
*ఉజ్జయిన్యాం మహాకాళీ - పీఠికాయాం పురుహూతికా*
*ఓఢ్యాయాం గిరిజాదేవి - మాణిక్యా దక్షవాటికే।*
*హరిక్షేత్ర కామరూపా - ప్రయాగే మాధవేశ్వరీ*
*జ్వాలాయాం వైష్ణవీ దేవి - గయా మంగళ్య గౌరికా॥*
*వారణస్యాం విశాలక్షీ - కాశ్మీరేత సరస్వతీ...*

దేవి మూడు రూపాలకు సంకేతం 'ఐం క్లీం హ్రీం' మూడు బీజాక్షరాలు. ఐం బీజాక్షరాన్ని సారస్వత బీజమంటారు. ఇది మహాసరస్వతికి సంకేతం. క్లీం బీజాన్ని కామరాజ బీజమంటారు. ఇది మహలక్ష్మీకి సంకేతం. హ్రీం బీజం మాయా బీజమని అంటారు. ఇది శక్తి స్వరూపిణీయైన శ్రీ మహాకాళికి సంకేతంగా పిలువబడుతుంది.

అమ్మవారి పేర్లు అనంతం. రూపాలు అనేకం. అమ్మవారు భక్తులకు విద్యనిస్తుంది. ధనాన్నిస్తుంది. చైతన్యాన్నిస్తుంది. చివరగా అఖండ జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. ఉపాసకులకు పెన్నిధిగా ఈ భువి మీద శక్తి క్షేత్రాలు వెలిశాయి.





| | | | |
|---|---|---|---|
| 1. | శ్రీ శాంకరీ దేవి | ట్రింకోమలి | శ్రీలంక |
| 2. | శ్రీకామాక్షి దేవి | కంచి | తమిళనాడు |
| 3. | శ్రీ శృంఖలాదేవి | ప్రద్యుమ్నం | పశ్చిమబెంగాల్ |
| 4. | శ్రీ చాముండేశ్వరి దేవి | మైసూరు | కర్ణాటక |
| 5. | శ్రీ జోగుళాంబ దేవి | అలంపూర్ | ఆంధ్రప్రదేశ్ |
| 6. | శ్రీ భ్రమరాంబికా దేవి | శ్రీశైలం | ఆంధ్రప్రదేశ్ |
| 7. | శ్రీ మహాలక్ష్మి దేవి | కొల్హాపూర్ | మహారాష్ట్ర |
| 8. | శ్రీ ఏక వీరికా దేవి | మహూర్ | మహారాష్ట్ర |
| 9. | శ్రీ మహంకాళీ దేవి | ఉజ్జయనీ | మధ్యప్రదేశ్ |
| 10. | శ్రీ పురూహూతికా దేవి | పిఠాపురం | ఆంధ్రప్రదేశ్ |
| 11. | శ్రీ గిరిజా దేవి | జాజ్ పూర్ | ఒరిస్సా |
| 12. | శ్రీ మాణిక్యాంబా దేవి | ద్రాక్షారామం | ఆంధ్రప్రదేశ్ |
| 13. | శ్రీ కామరూప దేవి | గౌహతి | అస్సాం |
| 14. | శ్రీ మాధవేశ్వరి దేవి | ప్రయాగ | ఉత్తర ప్రదేశ్ |
| 15. | శ్రీ వైష్ణవి దేవి | జ్వాలాముఖి | హిమాచలప్రదేశ్ |
| 16. | శ్రీ మాంగళ్యగౌరిదేవి | గయ | బీహార్ |
| 17. | శ్రీ విశాలాక్షి దేవి | వారణాశి | ఉత్తర ప్రదేశ్ |
| 18. | శ్రీ సరస్వతి దేవి | శ్రీనగర్ | కాశ్మీర్ |

ఈ శక్తి పీఠాలు భువి మీద అవతరించడానికి ఒక పురాణ కథ ఉంది. బ్రహ్మ సృష్టి ఆరంభంలో తొమ్మిది మంది ప్రజాపతులను సృష్టించాడు. వారిలో దక్షప్రజాపతి ఒకడు.

దక్షప్రజాపతి, తన కుమార్తె సతీదేవిని శివుడికిచ్చి వివాహం చేశాడు. నైమి శారణ్యంలో మునులు యజ్ఞాన్ని జరపాలని నిశ్చయించి, ఆ యజ్ఞానికి బ్రహ్మ, విష్ణు మహేశ్వరులను ఆహ్వానించారు.

వారు వచ్చి తమ పీఠాలయందు ఆశీనులైరి. యజ్ఞానికి ఇంద్రాది దేవతలను, ప్రజా పతులను కూడా ఆహ్వానించారు. దక్ష ప్రజాపతి రాకకు అల్లుడైన పరమేశ్వరుడు గౌరవం ఈయలేదు. అందుకు దక్షప్రజాపతి కోపగించుకున్నాడు.

కొంత కాలానికి దక్షప్రజాపతి ఒక యజ్ఞాన్ని తలపెట్టాడు. ఆ యజ్ఞానికి పార్వతీ పరమేశ్వరులను తప్ప అందరినీ పిలిచాడు.

తండ్రి చేస్తున్న యజ్ఞం గురించి తెలిసిన సతీదేవి శివుడు వద్దని వారిస్తున్నా వినకుండా బయలుదేరింది.

యజ్ఞానికి వచ్చిన సతీదేవిని దక్షుడు నిందించాడు. శివుడిని కూడా దూషించాడు. ఆ దూషణను భరించలేకపోయిన సతీదేవి అగ్నిప్రవేశం చేసింది.

ఆ విషయం తెలుసుకున్న పరమశివుడు ప్రళయకాల రుద్రుడై తన జడలను తీసి పర్వత శిఖరాన కొట్టగా ఆ జటాజూటం నుండి వీరభద్రుడు మరియు వీర మహాకాళీదేవి ఉద్భవించారు.

శివుని ఆజ్ఞ ప్రకారం భద్రకాళీ సమేతంగా వీరభద్రుడు సమస్త భూతగణాలతో దక్షయజ్ఞ వాటికకు బయలుదేరారు. వారు ప్రళయ తాండవం చేస్తూ దక్ష ప్రజాపతి యజ్ఞాన్ని ధ్వంసం చేసి, అతని తలను ఖండించాడు.

పరమేశ్వరుడు ప్రళయరుద్రుడై చితిలో దహనమై కాలుతున్న సతీదేవిని భుజాన మోసుకుంటూ ఉగ్రతాండవం ఆరంభించాడు. ఆ భయంకర తాండవానికి విశ్వమంతా వణికిపోవటం చూసిన మహావిష్ణువు లోక సంరక్షణార్థమై తన సుదర్శనాన్ని ప్రయోగించి సతిదేవి శరీరాన్ని ఛేధించాడు.

సతీదేవి శరీర భాగాలు భూమి మీద వివిధ ప్రదేశాల్లో పడ్డాయి. ముఖ్యమైన 18 ఖండాలు పడిన ప్రదేశాలలో మహాశక్తి పీఠాలు వెలిశాయి. అవే అష్టాదశ శక్తి పీఠాలుగా ప్రసిద్ధికెక్కాయి.

## 1. లంకాయాం శాంకరీదేవి

***శక్తి పీఠ ప్రదేశం :*** శ్రీలంక

ఇక్కడ సతీదేవి కాలి గజ్జెలు పడిన ప్రదేశంగా ప్రసిద్ధి. ఇక్కడి అమ్మవారికి ఇంద్రాక్షి అని నామధేయం.

'లంకాయా శాంకరీ దేవి' అని అష్టాదశశక్తి పీఠాల్లో మొదటిది. కాని శ్రీలంకను పరిశోధిస్తే ఎక్కడా శాంకరీదేవి ఆలయం కనిపించడం లేదు.

ఇక్కడ బౌద్ధమతం, క్రైస్తవ మతం అభివృద్ధి వల్ల హిందూమతానికి రాజపోషణ కరువయ్యింది. కొంతకాలానికి హిందూ దేవాలయాలు కూడా శిథిలంగా మారాయి.

శాంకరీదేవి ఆలయం కూడా కాలగర్భంలో కలసిపోయి ఉండవచ్చు. త్రేతాయుగంలో రావణాసురుడు, పరమేశ్వరునితోపాటు శాంకరీదేవిని నిత్యం పూజించినట్లు పురాణ కథనం.





పోర్చుగీసువారి వల్ల ఇక్కడ ఉన్న రావణాలయం ధ్వంసమై చర్చి కట్టారు. ప్రస్తుతం ట్రింకోమలి ప్రాంతంలో శాంకరీదేవి దర్శనం శూన్యం అయినా, క్షేత్ర మహాత్యం, క్షేత్రా దర్శనం ఆనందం కలిగించే విషయమే.

## 2. కామాక్షి కాంచికాపురే

పల్లవులు, చోళులు, విజయనగర రాజుల పాలనలో కాంచీపురం ఒక ముఖ్య పట్టణంగా వెలిగింది. వీరు నిర్మించిన ఆలయాల శిల్పసోయగాలు నేటికీ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి.

ఇది గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగానూ, విజ్ఞానుల నిలయంగానూ విలసిల్లింది. కాంచీపురానికి కంజీవరం మరియు కంచిగా పేర్లున్నాయి.

శివకంచి అనీ, విష్ణుకంచి అనే రెండు భాగాలుగా ఉంది. ఇటు శైవులకు, అటు వైష్ణవులకు సమాన ఆలయాలు ఒకే చోట ఉండటం విశేషం.

కాంచీపురం చుట్టుప్రక్కల ప్రదేశాలలో సుమారు వెయ్యి ఆలయాలున్నాయి. అందుకే కాంచీపురాన్ని 'సిటీ ఆఫ్ థౌజండ్ టెంపుల్స్' అని కూడా అంటారు.

ఇక్కడ అమ్మవారి కంకాళం పడిన ప్రదేశంగా భావిస్తున్నారు. శ్రీ కామాక్షి అమ్మవారు అష్టాదశ శక్తి పీఠాల్లో రెండవ పీఠంగా పరిగణిస్తున్నారు.

ఈ దేవాలయం చాలా విశాలంగా, చుట్టూ ప్రహారి గోడలతో ఉంటుంది. ఆది శంకరాచార్యుల వారిచే శ్రీ చక్రం స్థాపించబడింది. ఆలయం లోపల మూడు ప్రాకారాలు ఉన్నాయి.

మొదటి ప్రాకారంలో ఇరవై నాలుగు స్థంభాలు కలిగున్న గాయత్రి మండపం ఉంది. గాయత్రి మండపం మధ్య శ్రీ కామాక్షి అమ్మవారు ఆశీనురాలై ఉంది. అమ్మవారు చతుర్భుజాలు కలిగి, ఆగ్నేయం వేపుగా ముఖం కలిగి ఉంది. శ్రీ కామాక్షి అమ్మవారి రూపం దివ్యమంగళకరంగా ఉంటుంది.

## 3. ప్రద్యుమ్నే శృంఖలాదేవి

పశ్చిమ బెంగాల్‌లోని కలకత్తాకు 80 కిలోమీటర్ల దూరంలో హుగ్లీ జిల్లాలో పాండువా అనే గ్రామం ఉంది. దీనినే ప్రద్యుమ్నేం అని కొంతమంది పెద్దలు చెబుతుంటారు.

ఇక్కడ శృంఖలాదేవి శక్తి పీఠం ఉండేదని చెబుతారు. కానీ ప్రస్తుతం హుగ్లీ జిల్లాలోని పాండువా గ్రామంలో శక్తి పీఠం కనిపించడంలేదు. కనీసం

శక్తి ఆలయాన్ని కూడా దర్శించుకోలేము. ఇక్కడ మహమ్మదీయుల పరిపాలనలో హిందూ దేవాలయాలన్నీ నేలమట్టం కావించబడి అనేక మసీదులు కనబడుతున్నాయి. ఈ ప్రాంతంలో శృంఖలాదేవి ఆలయం కనిపించడంలేదు.

## 4. చాముండీ క్రౌంచ పట్టణే

కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగుళూరు. ఇక్కడి నుండి సుమారు 140 కిలోమీటర్ల దూరంలో మైసూరు పట్టణం ఉంది.

మైసూరు పట్టణానికి 13 కిలోమీటర్ల దూరంలో చాముండీ పర్వతముంది. ఇక్కడ సతీదేవి దివ్యాభరణాలు పడిన ప్రదేశంగా ప్రసిద్ధి.

మాత మూడవ అవతారంలో మహామాయ, మహాసరస్వతీ రూపిణిగా శుంభ, నిశుంభలనే రాక్షసులను సంహరించింది.

ఆమె శరీరం నుండి వెలువడిన కాళికాదేవి చండు, ముండులను వధించి ఇక్కడ చాముండిగా ప్రసిద్ధి పొందింది.

పురాణకాలంలో మహిషాసురుడు పాలించిన పురాన్ని మహిషాపురంగా పిలిచేవారు. అదే కాలక్రమేణా మైసూరుగా మారిందని అంటారు.

మహిషాసురుడు మరణంలేని వరాన్ని కోరుకోవాలని బ్రహ్మగురించి ఘోర తపస్సు చేశాడు. అతని తపస్సుకు మెచ్చి బ్రహ్మ సాక్షాత్కరించి ఏం కావాలో కోరుకోమని అడగ్గా– తనకు మరణం లేకుండా వరం ఇమ్మని ప్రార్థించాడు.

అందుకు బ్రహ్మ అది అసాధ్యం అని చెప్పగా– అప్పుడు మహిషాసురుడు స్త్రీని అబలగా భావించి, స్త్రీ తప్ప ఇతరుల చేతిలో మరణం లేకుండా వరం పొందాడు. బ్రహ్మ ఇచ్చిన వర ప్రభావంతో ముల్లోకాలను జయించి దేవతలను, మునులను బాధించసాగాడు.

ప్రజాకంటకుడిగా మారిన మహిషాసురుడిని సంహరించడానికి జగన్మాత చాముండేశ్వరి దేవిగా అవతారం దాల్చి మహిషాసురుడిని వధించి వేసింది. రాక్షస సంహారం అనంతరం చాముండేశ్వరీదేవి మహిషాసుర మర్ధనిగా పేరు పొందింది. ఈ దేవి మైసూరు ప్రభువులకు కులదైవంగా మారింది.

ఇతిహాసకాలమందు చాముండీ పర్వతాన్ని మహాబలాద్రి పర్వతంగా పిలిచేవారు. దీన్నే మహాబలగిరి అనికూడా అనేవారు.

మహాబలాద్రి పర్వతం మీద స్వయంభువ లింగంగా వెలసిన శ్రీమహాబలేశ్వర ఆలయం చాలా ప్రాచీనమైంది. ఈ శివాలయంలోని లింగం





చాలా మహిమ కలది. భక్తులు తమ కోర్కెలు తీరడం కోసం నియమంగా స్వామిని ఆరాధించేవారు. వారి సర్వబాధలు తొలగిపోయి, సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని భక్తుల విశ్వాసం.

## 5. అలంపురీ జోగులాంబా

ఈ క్షేత్రంలో సతీదేవి శరీరాంతర్గత వజ్రాస్తికలు పడినట్లు ప్రతీతి. ఇది ఆంధ్రప్రదేశ్‌లోని మహబూబ్‌నగర్ జిల్లాలో అలంపుర క్షేత్రంలో అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటైన శ్రీ జోగులాంబాదేవి, శ్రీ బాల బ్రహ్మేశ్వస్వామి వారు కొలువై ఉన్నారు.

ఈ క్షేత్రంలోని శ్రీ జోగులాంబాదేవి ఆలయంతోపాటు నవ బ్రహ్మలైన బాలబ్రహ్మ, ఆర్కబ్రహ్మ, విశ్వబ్రహ్మ, కుమార బ్రహ్మ, వీర బ్రహ్మ, గరుడ బ్రహ్మ, స్వర్గ బ్రహ్మ, తారకబ్రహ్మ, పద్మబ్రహ్మ అనే నవబ్రహ్మలయాలున్నాయి.

ఈ నవబ్రహ్మలకు ఇక్కడ తప్ప ఇంకెక్కడా విగ్రహాలు లేకపోవడం ఒక ప్రత్యేకత. వీటిలో తారకబ్రహ్మ ఆలయం ధ్వంసమయింది.

శ్రీ బాల బ్రహ్మేశ్వరాలయం మహా ద్వారం వద్ద కామాక్షీదేవి, ఏకాంబరేశ్వరులు ఉన్నారు. ఆలయ ముందు భాగంలో ద్వారానికి ఉత్తరంగా ఉన్నగుడిలో త్రిమూర్తులు, దక్షిణాన వీరభద్రుడు, నగగ్రహాలు, సప్త మాతృకలు ఉన్నాయి.

అలంపురం కోటలోపల నరసింహాలయం, సూర్య భగవానుడి ఆలయాలున్నాయి. ప్రవేశ ద్వారానికి పక్కనే చాలా ఎత్తైన ఆంజనేయ విగ్రహం ఉంది.

అలంపురం దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందింది. పవిత్రమైన కాశీకి, అలంపురం క్షేత్రానికి చాలా దగ్గరి పోలికలున్నాయి.

కాశీక్షేత్ర దైవంగా విశ్వేశ్వరుడు, శక్తిపీఠంగా విశాలాక్షిదేవి కొలువై ఉన్నారు. ఇక్కడ గంగానది ఉత్తర వాహినిగా ప్రవహిస్తుంది. కాశీ నగరానికి ఇరు వైపులా వరుణ–అసి అనే నదులు ఉన్నాయి.

ఇక్కడ 18 తీర్థాలు, 64 స్నాన ఘట్టాలున్నాయి. కాశీకి దగ్గరలో గల ప్రయాగలో త్రివేణి సంగమం ఉంది. గయక్షేత్రాన గదాధర సన్నిధిలో తీర్థశ్రాద్ధాలు జరుగుతాయి.

ఇదే విధంగా అలంపురం నందు క్షేత్రదైవం శ్రీబాల బ్రహ్మేశ్వరుడు, శక్తి పీఠంగా శ్రీ జోగులాంబాదేవి కొలువై ఉన్నారు. ఇక్కడ తుంగభద్రనది

ఉత్తర వాహినిగా ఉంది. అలంపురానికి ఇరువైపులా వేదవతీ-నాగావళీ అనే ఉపనదులు ఉన్నాయి. 18 తీర్థాలు, 64 స్నానఘట్టాలున్నాయి. తుంగభద్రానది కృష్ణానదిలో సంగమం అవుతుంది.

అలంపురానికి దక్షిణంగా పాపవినాశినీ తీర్థం వద్ద గదాధర విగ్రహం ఉంది. ఇక్కడ కూడా తీర్థ శ్రాద్ధాలు జరుగుతాయి. దీన్ని బట్టి కాశీక్షేత్రానికి, అలంపురక్షేత్రానికి చాలా దగ్గరి పోలికలు ఉండటం మనం గమనించవచ్చు.

## 6. శ్రీశైలే భ్రమరాంబికా

ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో నందికొట్కూరు తాలూకాలో ఉంది. శ్రీశైల దేవీ శక్తి పీఠం.

ఇది పురాణ ప్రసిద్ధి చెందిన శివక్షేత్రం. ద్వాదశ జ్యోతిర్లింగాలలో రెండవది అయిన శ్రీ మల్లిఖార్జున లింగం, అష్టాదశ శక్తి పీఠాలలో ఆరవది అయిన శ్రీభ్రమరాంబికా పీఠంను శ్రీశైలంలో దర్శించుకోవచ్చు.

ఇక్కడ సతీదేవి కంఠభాగం పడినచోటుగా చెబుతారు. అరుణాసురుడనే రాక్షసున్ని అమ్మవారు భ్రమర (తుమ్మెద) రూపంలో సంహరించి లోకానికి రాక్షస బాధ వదిలించింది.

భక్తులు అమ్మవారిని భ్రమరాంబికా దేవిగా కొలుస్తారు.

అరుణాసురుడు మహాబలవంతుడు. బ్రహ్మ గురించి పదివేల సంవత్సరాలు ఘోరంగా తపస్సు చేసాడు. బ్రహ్మ ప్రత్యక్షమై వరం కోరుకోమని అడగ్గా- ఆయుధాల చేతగాని, స్త్రీ, పురుషుల చేతగాని మరణం లేకుండా వరం కోరుకున్నాడు.

అప్పటి నుండి అరుణాసురుడు దేవతలను, మునులను హింసిస్తుండగా దేవతలు దేవి ఉపాసన చేయగా దేవి సాక్షాత్కరించింది. వారికి అభయం ఇచ్చింది.

ఆమె భ్రమరంగా మారింది. ఆమె చుట్టూ వేలకొలది భ్రమరాలు ఝుంకారం చేస్తూ ఆమె వెంట బయలుదేరాయి. అమ్మవారి ఆజ్ఞతో తుమ్మెదలు ఝుంకరిస్తూ అరుణాసురుని నగరానికి చేరి రాక్షసులందరి తలకాయలు కొరికి రాక్షస వధ చేసాయి.

అరుణాసురుడు కూడా భ్రమరాంబికాదేవిచే వధించబడ్డాడు. దేవి దేవతల కోరికపై శ్రీశైలంలో శ్రీ మల్లిఖార్జునస్వామి చెంత భ్రమరాంబికాదేవిగా వెలిసింది.





స్వామివారి ఆలయం వెనుక వైపు కొంత ఎత్తులో శ్రీభ్రమరాంబికా ఆలయం ఉంది. అమ్మవారి దృష్టి నేరుగా శ్రీ మల్లిఖార్జున జ్యోతిర్లింగం మీద ఉండేట్లుగా ఆలయ నిర్మాణం చేసారు.

స్వామివారి ఆలయం చాలా పురాతన మైంది. 16వ శతాబ్దంలో అమ్మవారి ఆలయ నిర్మాణం జరిగింది. శ్రీ ఆదిశంకరాచార్యులు చక్ర ప్రతిష్ట చేసారు.

## 7. కొల్హాపురీ మహాలక్ష్మి

ఇక్కడ సతీదేవి వామహస్తం పడిన ప్రదేశంగా చెబుతారు. మహారాష్ట్రలో కొల్హాపూర్ నందు దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన క్షేత్రంలో శ్రీమహాలక్ష్మి అష్టాదశ శక్తి పీఠంగా విలసిల్లుతుంది.

అమ్మవారితో పాటు శ్రీ మహాదేవ లింగం ఉంది. ఈ లింగానికి చాలా ప్రాముఖ్యత ఉంది. ఈ ఆలయాన్ని తొమ్మిదవ శతాబ్దంలో నిర్మించారు. ఆలయం మీద అయిదు గోపురాలు దర్శనమిస్తాయి.

ప్రధాన ఆలయంలో శ్రీ మహాలక్ష్మికి ఇరుపక్కలా శ్రీ మహాకాళి, శ్రీమహా సరస్వతి కొలువై ఉన్నారు.

వీరితోపాటు శ్రీ మహాగణపతి దర్శనం కూడా లభిస్తుంది. శ్రీ మహాదేవ లింగానికి ఆలయంలో ప్రత్యేకంగా స్థానం ఉంది.

జగన్మాత అయిన మహాలక్ష్మి గర్భాలయం బయట శ్రీ యంత్రం ఉంది. భక్తులు ఈ యంత్రానికి పూజలు చేస్తారు. అమ్మవారికి ఎదురుగా సింహవాహనం ఉంది. శ్రీమహాలక్ష్మి అమ్మవారికి బంగారు పాదుకలున్నాయి. దేవి శిరస్సు మీద ఒక నాగపడగ పడగలో శివలింగం, యోని ముద్రలు ఉన్నాయి.

ఈ ఆలయ ప్రాంగణంలో శ్రీ మహాదేవుడు, శ్రీ పాండురంగస్వామి, రాధా కృష్ణా ఆలయం, శని మందిరం మొదలైన మందిరాలన్నీ కలసి మొత్తం 35 వరకు ఉన్నాయి. ఆలయ ప్రాంగణానికి నాలుగు పక్కలా నాలుగు ముఖ ద్వారాలున్నాయి.

శ్రీమహాలక్ష్మి అమ్మవారికి ఎదురుగా ఉన్న ద్వారాన్ని మహా ద్వారంగా పిలుస్తారు. కొల్హాపూర్‌లో శరన్నవ ఉత్సవాలు ఆశ్వయుజ మాసంలో శుద్ధపాడ్యమి నుండి తొమ్మిది రోజులు చాలా వైభవంగా జరుగుతాయి.

ఇక్కడ మొదటిరోజు, అయిదవరోజు, ఏడవరోజు, తొమ్మిదవరోజు జరుగు ఉత్సవాలు విశేషంగా ఉంటాయి.

దసరా ఉత్సవాలు కూడా చాలా ఘనంగా జరుగుతాయి. రంగు రంగుల విద్యుత్ దీపాల తోరణాలతో అందంగా దసరా చౌక్ ప్రాంతం అలంకరిస్తారు. పౌర్ణమినాడు దేవస్థానం వారు భోజన కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకి మహారాష్ట్ర నుంచి కర్ణాటక నుంచి భక్తులు వేల సంఖ్యలో వచ్చి పాల్గొంటారు.

## 8. మహూర్యే ఏక వీరికా

మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో సుమారు 135 కిలో మీటర్ల దూరంలో మహూర్‌గడ్ గ్రామం. ఈ గ్రామం నిత్యం భక్తులతో, యాత్రికులతో కోలహలంగా, తిరునాళ్లుగా దర్శనం ఇస్తుంది.

మహూర్‌గడ్ బస్టాండ్‌కు మూడుకిలో మీటర్ల దూరంలో గల ఎత్తైన కొండ మీద శ్రీ రేణుకాదేవి శక్తి పీఠం ఉంది. దీన్ని శ్రీ ఏకవీరికా దేవి శక్తి పీఠంగా భక్తులు కొలుస్తుంటారు. అష్టాదశశక్తి పీఠాలలో ఇది ఒకటి.

ఇక్కడ సతీదేవి కుడిస్తనం పడిన స్థలంగా భక్తులు భావిస్తారు. మహారాష్ట్రలో వెలిసిన శ్రీమహాలక్ష్మి పీఠాన్ని ప్రజలు భక్తి విశ్వాసాలతో పూజించుకుంటారు.

ఈ దేవాలయమంతా సింధూర రంగులో ఉంటుంది. చిన్న ముఖ ద్వారం గుండా ఆలయ ప్రవేశం ఉంటుంది.

ముందుగా శ్రీ పరశురామ్ గణేశుని దర్శనం చేసుకోవాలి. తర్వాత ఏకవీరికా దేవిని దర్శించుకోవాలి.

భుజాలుగాని, మెడగాని లేని ఏకవీరికా మాత శిరోభాగం మాత్రమే దర్శనం ఇస్తుంది. అమ్మవారికి ముఖమంతా సింధూరం పూస్తారు. అమ్మవారి ముక్కు, నోరు, కళ్లు స్పష్టంగా చూడవచ్చు.

ఏకవీరికాదేవి మహా తేజోవంతంగా విరాజిల్లుతోంది. ఈ మందిరంలో ఒక పక్క యజ్ఞ పీఠిక ఉండగా, ఇంకొక పక్క ఉయ్యాలలో పరశురాముని విగ్రహం దర్శనం ఇస్తుంది.

రేణుకాదేవి మందిరానికి మూడు కిలో మీటర్ల దూరంలో శ్రీ దత్తపీఠం ఉంది. దీన్నే శ్రీ క్షేత్రం అని పిలుస్తారు.





ఈ క్షేత్రాన్ని జమదగ్నిముని భార్య, పరశురాముని తల్లి అయిన రేణుక పేరున శ్రీ రేణుకా క్షేత్రం అయిందని అంటారు. ఈ ఆలయ ప్రాంగణంలో అనేకమైన శివలింగాలు దర్శనమిస్తుంటాయి.

దత్త భక్తులు దేశం నలుమూలల నుండి శ్రీ క్షేత్రమందలి శ్రీ దత్తాత్రేయస్వామిని దర్శించుకుంటారు. భారతదేశంలో మొత్తం ఆరు దత్త పీఠాలున్నాయి. వీటిని శ్రీ క్షేత్రాలుగా పిలుస్తారు.

మహూర్ గడ్, పిఠాపురం, కురువాపూర్, ఔదుంబర్, నరసోబావాడి, గాణ్‌గా పూర్ అనే ఆరుక్షేత్రాలలో పీఠాలున్నాయి.

## 9. ఉజ్జయిన్యాం మహాకాళీ

మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఉజ్జయినినే మహాకాళ పీఠంగా అభివర్ణిస్తారు. ఈ క్షేత్రం క్షిప్రా నదీ తీరంలో ఉంది.

ఈ క్షిప్రా నదీ తీరాన ప్రతి పన్నెండు సంవత్సరాలకి ఒకసారి కుంభమేళా మహోత్సవాలు జరుగుతుంటాయి.

ఇక్కడ సతీదేవి మోచేయి పడిన ప్రదేశంగా చెబుతారు. ద్వాదశ జ్యోతిర్లింగాలలో మూడవది అయిన శ్రీమహాకాళ లింగం, అష్టాదశ శక్తి పీఠాలలో తొమ్మిదవది అయిన శ్రీ మహాకాళీ శక్తి పీఠం ఉన్న పవిత్ర పుణ్యతీర్థం ఉజ్జయిని.

ఉజ్జయిని రైల్వేస్టేషన్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో శ్రీమహా కాళేశ్వరాలయంఉంది. దీని వెనక వైపు సుమారు 500 మీటర్ల దూరంలో శ్రీ హరసిద్ధి మాత దేవాలయం ఉంది. దీన్నే శ్రీ మహాకాళీ శక్తిపీఠంగా పిలుస్తారు.

ఆలయానికి తూర్పు ముఖంగా, దక్షిణ దిక్కుగా రెండు ద్వారాలున్నాయి. గర్భాలయంలో హరసిద్ధి మాత ముఖం మాత్రమే దర్శనమిస్తుంది. దేవి ముఖమంతా సింధూరం పూస్తారు. అమ్మవారి శాంతిరూపం, చల్లని చూపులు భక్తులకు ఆధ్యాత్మిక శక్తిని ఇస్తాయి.

దేవాలయ ప్రాంగణంలో గౌరి, అన్నపూర్ణ మొదలైన శక్తి రూపాలు దర్శనమిస్తాయి.

ఈశాన్యంగా గణపతి మందిరం ఉంది. గణపతికి కూడా శరీరమంతా సింధూరం పూస్తారు.

ఆలయానికి ఎడమవైపున కొంత దూరంలో శ్రీరామ మందిరం ఉంది. కుడి వైపుగా అనేక మందిరాలున్నాయి.

ఉజ్జయిని నగరంలో శ్రీ మహాకాళేశ్వరాలయం ముఖ్యమైనది. ఆలయప్రాకారంలో ప్రధానాలయం రెండు అంతస్తులుగా ఉంటుంది. మొదటగా ఓంకారేశ్వరుడు, రెండవ అంతస్తులో శ్రీ నాగేశ్వరుడు వెలిసి ఉండగా, భూగర్భావ శ్రీమహాకాళేశ్వరుడు కొలువై ఉన్నాడు.

ఒకప్పుడు ఉజ్జయిని నగరాన్ని అవంతిక పురం అని పిలిచేవారు. యుగయుగానికి అవంతిక పురం పేరు మారుతూ వస్తూంది. కలియుగంలో ఉజ్జయినిగా ప్రసిద్ధి చెందింది.

వెనుకటి కల్పాలలో సువర్ణ శృంగం, కుశస్థలి, అమరావతి, కనక శృంగి, చూడామణి, కుముద్వతి, పద్మావతిగా పిలిచేవారు. మహాకాళుడు నివాసమున్న ఉజ్జయిని నగరంలో మరణిస్తే పుణ్యలోకాలకు వెళ్తామని భక్తులు విశ్వసిస్తారు.

అందుకే అనేక మంది భక్తులు తమ చివరి ఘడియలు ఇక్కడ గడపడానికి ఆసక్తి చూపుతారు.

మహంకాళపురంలో జీవి శవమైన తర్వాత దుర్వాసనరాదు. కట్టెలా బిగుసుకుపోదు.

ఈ క్షేత్రం అందులో సిద్ధపటంలో అంతిమ దహన సంస్కారాలతో జీవముక్తిని పొందుతాడు. మహాకాళ, మహాకాళ అని స్మరించేవారిని అఖండ పుణ్యవంతులుగా జీవిస్తారు.

## 10. పీఠికాయాం పురుహూతికా

ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న పిఠాపురం ప్రాచీన కాలంలో పురుహూతిక నగరంగా పిలిచేవారు. ఇది కాకినాడ పట్టణానికి 19 కిలోమీటర్ల దూరంలో ఉంది.

ఇది చుట్టు పక్కల ప్రాంతాలకు ముఖ్య కేంద్రం. ఆనాటి మహారాజుల భవనాలు, కట్టడాలు చరిత్ర గర్భంలో కలసిపోయాయి. వీటితో పాటు శ్రీ పురుహూతిక పీఠం కూడా కాలగర్భంలో కలసిపోయి ఉండవచ్చు.

ఇక్కడ సతీదేవి పిరుదులు పడిన ప్రదేశంగా ప్రసిద్ధి చెందింది. అష్టాదశ శక్తి పీఠాలలో పదవ పీఠం అయిన శ్రీ పురుహూతికా మూల స్థానం శ్రీకుక్కుటేశ్వరాలయ ప్రాంగణంలో ఈశాన్య దిక్కుగా ఉంది.

గర్భగుడిలో అమ్మవారు శాంతి రూపంలో దర్శనం ఇస్తుంది. శ్రీ పురుహూతికా దేవిని ముందుగా ఇంద్రుడు ఆరాధించాడు. గయాసురుడు





కూడా ఆరాధించిన శక్తిగా ప్రసిద్ధి పొందింది. ఇక్కడ అమ్మవారికి నిత్య పూజలు జరుగుతుంటాయి.

అమ్మవారి మంటపంలో నాలుగు దిక్కులూ, గర్భగుడి గోడల మీద అష్టాదశ శక్తి పీఠాలను పొందుపరిచారు. ఆశ్వీజమాసంలో దేవికి నవరాత్రులు అత్యంత వైభవంగా జరుగుతాయి. విజయదశమినాడు జమ్మి ఉత్సవం ఘనంగా జరుగుతుంది.

పిఠాపుర క్షేత్రంలో శ్రీ కుక్కుటేశ్వరుడు స్వయంభూలింగంగా వెలిసాడు. ఇది కాశీతో సమానమైంది. అందుకే దీన్ని దక్షిణ కాశీగా పిలుస్తుంటారు.

14వ శతాబ్దం వాడైన శ్రీనాథకవి సార్వభౌముడు తన కావ్యంలో ఈ క్షేత్రాన్ని పీఠికాపురం, పీఠా పట్టణం, పిఠాపురంగా వర్ణించాడు. శ్రీ కుక్కుటేశ్వరక్షేత్రం కాశీ, కేదార, కోణార్క, కుంభకోణాలకు సరి సమానమైన మోక్షదాయకమైనదని వర్ణించాడు. ఇక్కడ జరిపే దానం, హోమం, అధ్యయనం, శ్రాద్ధం, దేవతార్చనలు, వ్రతాలు మొదలైనవి కోటిరెట్లు ఫలితాలని ఇస్తాయని భీమేశ్వర పురాణంలో వివరించారు. ఎందరో కవులు తమ భక్తి కుసుమాలతో స్వామిని పూజించుకున్నారు.

రాజగోపురం గుండా ప్రవేశించినంతనే పాద గయ పుష్కరిణి దర్శనమిస్తుంది. ఈ పుష్కరిణి చాలా విశాలంగా, పరిశుభ్రంగా ఉంటుంది.

పుష్కరిణికి దక్షిణ దిశగా రుద్రభూమి, ఆగ్నేయంగా కర్మశాల, నైరుతిదిశగా కర్మపిండాలు చేసుకోవటానికి శాలలు ఉన్నాయి. ఉత్తరంగా రాజగోపురం, స్నానపుగదులు మొదలైన సౌకర్యాలున్నాయి. పశ్చిమ వైపుగా శ్రీ కుక్కుటేశ్వరాలయ ముఖద్వారం తూర్పు ముఖంగా ఉంది.

గర్భాలయంలో స్వామి స్ఫటిక లింగరూపంలో దర్శన మిస్తాడు. స్వామి వారికి ఎదురుగా ఏక శిలా రాతితో మలచిన నందీశ్వరుడు కనిపిస్తాడు. ఆలయ గర్భగుడి వెనక వైపు పాదగయ చిహ్నం కుక్కుటం (కోటి పుంజం) దర్శనమిస్తుంది.

## 11. ఓఢ్యాయాం గిరిజా దేవి

ఒరిస్సా రాష్ట్రానికి ఈశాన్యంగా జిల్లా ముఖ్య పట్టణం జాజ్‌పూర్ నగరం. ఈ నగరంలో అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటైన గిరిజాదేవి పీఠం ఉంది.

ఈ దేవిని విరజా దేవిగా పిలుస్తారు. స్థానికులు బిరజాదేవిగా కొలుస్తారు. జాజ్‌పూర్ చాలా ప్రాచీన నగరం. ఈ జాజ్‌పూర్‌లో శక్తి పీఠంతోపాటు

శైవమతానికి చెందిన అనేక శివలింగాలు, వైష్ణవ మతానికి చెందిన ఆలయాలు మరియు తీర్థాలు ఉన్నాయి.

ఈ క్షేత్రం తాంత్రిక, మంత్ర పీఠంగా కూడా ఖ్యాతి చెందింది. జాజ్‌పూర్ ప్రాంతం హైందవ మతంతోపాటు బౌద్ధమతం, జైనమతం కూడా అభివృద్ధి చెందినట్లు శాసనాలు తెలియజెపుతున్నాయి.

ఈ ఆలయ నిర్మాణం 18వ శతాబ్దంలో జరిగింది. ఆలయ ప్రాంగణంలో నాభిగయ, ఇన్నెశ్వర్ శివాలయం, హనుమాన్ మందిరం, డోల మండలం, కార్తికేయ, భైరవ, గంగాధర్‌తోపాటు 108 శివలింగాలు, విష్ణురూపాల్ని దర్శించుకోవచ్చు.

దేవాలయ గర్భగుడిలో విరజాదేవి మహా తేజోవంతంగా విరాజిల్లుతోంది. సతీదేవి నాభి స్థానం ఇక్కడ పడటంతో శక్తి పీఠంగా పూజిస్తారు. గుప్తుల కాలంనాటి విరజాదేవి విగ్రహం, రెండు చేతులు కలిగిన మహిషాసుర మర్ధినిగా ఉంటుంది.

అమ్మవారు రాక్షస శక్తి అయిన ఎనుబోతును (మహిషాసుర) తన ఎడమకాలితో తొక్కి, కుడిచేతిలోని త్రిశూలాన్ని ఎనుబోతు శరీరంలో గుచ్చి, తోకను ఎడమ చేతితో పుచ్చుకుని నిలుచుని ఉంటుంది.

ఇటువంటి మహిషాసుర మర్ధిని రూపాన్ని భారతదేశంలో మరొకచోట మనం దర్శించుకోలేము.

విరజాదేవి అమ్మవారి ఆలయానికి ఈశాన్యంగా నాభిగయ (నుయ్యి) భాగం ఉంది. ఈ నాభిగయ వద్ద పితృకర్మలు చేయించి, పిండ ప్రదానాలు చేయిస్తారు.

నాభిగయ వెనక వైపు గదాధర మూర్తి ఉన్నాడు. ఇతడు పిండ ప్రదాన కార్యక్రమాలకు సాక్షిగా ఉంటాడు.

నాభిగయలో అన్ని సమయములందు పిండ ప్రదాన కార్యక్రమాలు జరగటం ప్రత్యేక విశేషం. ఈ నాభిగయను పితృతీర్థం అని కూడా అంటారు.

## 12. మాణిక్యా దక్షవాటికే

ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడకు 32 కిలో మీటర్ల దూరంలో ఉంది ద్రాక్షారామం. భరతఖండంలో విలసిల్లిన అష్టాదశశక్తి పీఠాలలో ద్వాదశ పీఠం ద్రాక్షారామంలోని మాణిక్యాంబ దేవిది.





ఇక్కడ సతీదేవి ఎడమ చెక్కిలి పడిన ప్రదేశంగా చెబుతారు. దక్షుడు యజ్ఞం చేసిన ప్రదేశాన్ని దక్ష వాటికగా పిలుస్తారు. ఈ దక్షవాటికనే దక్షరామం అని పిలువబడి కాలక్రమేణా ద్రాక్షారామంగా మారింది.

ఇక్కడ పరమేశ్వరుడు భీమరూపాన స్వయంభువు అయినాడు. ఈ స్వయంభులింగాన్ని భీమేశ్వరుడిగా భక్తులు కొలుస్తారు. దక్షిణ భారతదేశంలో అతి పురాతనమైన మరియు పురాణ ప్రసిద్ధి గాంచిన శైవక్షేత్రాలలో ఇది ఒకటి.

శ్రీశైలం, శ్రీకాళేశ్వరం, శ్రీద్రాక్షారామం మధ్య నున్న భూమిని త్రిలింగ దేశంగా పిలుస్తుంటారు.

ఈ దేవాలయంలో మాణిక్యాంబదేవికి ప్రత్యేక స్థానం ఉంది. భీమేశ్వర ఆలయంలో రెండవ ప్రాకారంలో గర్భాలయానికి నాలుగు దిశలా మండపం ఉంది. మండపం వరసలో మాణిక్యాంబ శక్తి పీఠం ఉంది.

మాణిక్యాంబదేవిని తూర్పు చాళక్యులు తమ ఇలవేల్పు దేవతగా పూజించారు. శ్రీ ఆదిశంకరులువారు మాణిక్యాంబను శ్రీ చక్ర బిందువుపై ప్రతిష్ఠించారు. అమ్మవారికి నిత్యం కుంకుమ పూజలు చేస్తారు.

శ్రీ భీమేశ్వరస్వామి దేవాలయానికి నాలుగు వైపులా నాలుగు ఎత్తైయిన రాజ గోపురాలు ఉన్నాయి. దక్షిణ దిశగా ఉన్న రాజగోపురం నుండి ఆలయ ప్రవేశం చేయాలి. దీనికి ఆగ్నేయంగా ఇంద్ర ఘటం ఉంది.

ఇక్కడ సర్వమంగళాదేవి సమేత శ్రీపాక శాసన స్వామి ఆలయం ఉంది. స్వామికి ఎదురుగా ఉన్న తీర్థంలో భక్తులు స్నానం చేసి పాకశాసనస్వామిని దర్శించుకుంటారు.

దగ్గరలోనే ప్రసన్నాంజనేయస్వామి ఆలయం, రమాపతీ సమేత సత్య నారాయణస్వామి ఆలయాలు ఉన్నాయి.

తూర్పున యాగశాల, నైరుతిలో మంగళవారపు మండపం, వాయువ్యంగా సోమవార మండపం, ఈశన్యంగా కాళభైరవుని ఆలయం మొదటి ప్రాకారంలో ఉన్నాయి.

రెండవ ప్రాకారంలో క్షేత్రపాలకుడైన శ్రీలక్ష్మీనారాయణులను, శ్రీరామచంద్రస్వామిని ప్రతిష్టించారు.

ఇక్కడ కార్తీక మాసంలో కార్తీక జ్వాలా తోరణ ఉత్సవం తప్పకుండా చూసి తీరవలసిందే. స్వామివారికి, అమ్మవారికి నిత్యం సేవలు జరుగుతుంటాయి.

## 13. హరిక్షేత్ర కామరూపా

అస్సాం రాష్ట్రంలోని ముఖ్య పట్టణమైన గౌహతి పట్టణానికి పదికిలోమీటర్ల దూరంలో నీలాచల పర్వతం మీద అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటైన శ్రీకామాఖ్య అమ్మవారి దేవాలయం ఉంది.

అస్సాం రాష్ట్రాన్ని పూర్వం కామరూప దేశంగా పిలిచేవారు. అలాగే నీలాచలపర్వతాన్ని కూడా కామగిరి పర్వతం అని కూడా అంటారు.

కామాఖ్య శక్తి పీఠం పూర్వకాలం నుండి ప్రసిద్ధి చెందిన శక్తి పీఠంగా మరియు తాంత్రిక విద్యలకు, పూజలకు ప్రసిద్ధి పొందింది. ప్రపంచంలోని అతి పెద్ద నదులలో ఒకటైన బ్రహ్మపుత్రనది ఈ పర్వతాన్ని ఆనుకుని ప్రవహిస్తుంది.

ఇక్కడ సతీదేవి యోనిభాగం పడిన ప్రదేశంలో కామాఖ్యాశక్తి పీఠంగా విలసిల్లుతోంది. ఇది కామాఖ్యా సిద్ధి పీఠంగా, కామాఖ్యా తాంత్రిక పీఠంగా ప్రపంచ ప్రసిద్ధి పొందింది.

ఈ అమ్మవారిని నగర వాసులతోపాటు, చుట్టు పక్కల ఉన్న గిరిజన తెగలకు కూడా ముఖ్యమైన ఆరాధ్య దేవత. అమ్మవారు శక్తిరూపం కాబట్టి ఇక్కడ బలిపూజాదులు జరుగుతుంటాయి. గిరిజన భాషలో కామాఖ్య అంటే జన్మనిచ్చే తల్లి అని అర్థం.

కామాఖ్య అమ్మవారి దేవాలయం లోపల ఒక గుహ కనబడుతుంది. లోపల ఒక మూలగా నల్లని రాతి మీద యోని రూపం చెక్కి ఉంటుంది. ఆ రూపాన్ని భక్తులు పూజిస్తారు. భగము అనగా యోని అని అర్థం ఉంది. అందువలన కామఖ్యాదేవిని భగవతి అనే పేరుతో పిలుస్తారు.

శ్రీ ఆదిశంకరాచార్యులు తాంత్రిక పూజకు వ్యతిరేకంగా పంచాయతన పూజా విధానాన్ని ప్రవేశపెట్టారు. అప్పటి నుండి ఈ తాంత్రిక పూజలు తగ్గాయని చెబుతారు.

కామాఖ్యదేవిని తార, సరస్వతీ, ఛండీ, కాళీ, దుర్గ మొదలైన రూపాలలో కూడా పూజలు చేస్తుంటారు.

భక్తులు పూజలతో, ఉపవాసాలతో కుమారీ పూజను చేస్తారు. కుమారీ పూజను కన్యపూజ అని కూడా అంటారు. నవరాత్రులలో ప్రతిరోజు ఒక్కొక్క కన్యను శాస్త్రోక్తంగా పూజిస్తారు. రెండేళ్ళ నుండి ఏడేళ్ళ వయసు ఉన్న కన్యలే





ఇందుకు అర్హులు. ఒంటి మీద మచ్చలు, గాయాలు, కురుపులు ఉన్నవారు కన్యపూజకు అర్హులు కారు.

వీరిని అమ్మవారి మూర్తిగా భావించి, శ్రీయుక్త నామ మంత్రాలతో పూజిస్తారు. వివాహం కాని స్త్రీలు వివాహం కావాలని కుమారీదేవిని పూజిస్తారు.

## 14. ప్రయాగే మాధవేశ్వరీ

ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్ నగరంలో ఉంది ఈ ప్రయాగక్షేత్రం. ఇది గంగ, యమున, సరస్వతి నదుల త్రివేణి సంగమం. ఈ మూడు నదులలో గంగ నీరు తెల్లగా , యమున నీరు నల్లగా, సరస్వతి అంతర్వాహిని అని చెబుతారు.

ఇక్కడ సతీదేవి హస్తాంగుళీయకం పడిన ప్రదేశంగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ విగ్రహ రహితమైన, శ్రీ చక్ర స్వరూపిణి అయిన అమ్మవారు మాధవేశ్వరిగా, కుముదా దేవిగా పూజింపబడుతుంది.

కొందరు అలోపిదేవి అనీ, మాయాదేవి అని కూడా పిలుస్తారు. అలహాబాద్ నుండి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న దారాగంజి అనే ప్రాంతంలో గల అలోపిబాగ్‌లో అమ్మవారిని దర్శనం చేసుకొనవచ్చును. ఇది అలోపి శంకరి శక్తి పీఠంగాను, మహేశ్వరి పీఠంగాను ప్రసిద్ధి పొందింది.

అమ్మవారి ఆలయం విశాలమైన ప్రాంగణంలో ఉంది. పీఠానికి మధ్య ఒక రంధ్రం కనిపిస్తుంది. దీని మీద అమ్మవారి ఊయల వేలాడుతూ ఉంటుంది. భక్తులు తెచ్చిన కొబ్బరికాయలను రంధ్రంలో గల అమ్మవారికి సమర్పించి, అమ్మవారి ఊయలను భక్తి శ్రద్ధలతో ఊపుతారు. ఆలయానికి వెనక భాగాన గణపతి, నవదుర్గలు, శివ లింగాలు మొదలైనవి ఉన్నాయి.

ఈ ప్రయాగ నందు పన్నెండు మాధవులు వెలిసారు. అవి శంఖ మాధవం, అనంత మాధవం, చక్రమాధవం, సంకష్టమాధవం, గదా మాధవం, ఆదివేణీ మాధవం, పద్మమాధవం, బిందు మాధవం, అసిమాధవం, త్రివేణిమాధవం, మనోహర మాధవం, ఆది మాధవం. వీటితోపాటు శయన హనుమాన్ మందిరం, అక్షయవటవృక్షం, సోమేశ్వర ఆలయం, అలోపిదేవి మందిరం, బలదేవాలయం మొదలైనవి దర్శనీయ ప్రదేశాలు.

ఈ త్రివేణీ సంగమ స్థానంలో ప్రతి పన్నెండు సంవత్సరాల కొకసారి కుంభమేళా మహా ఉత్సవాలు జరుగుతాయి. దేశం నలు దిశల నుంచి

యాత్రీకులు తరలి వస్తారు. లక్షలాది యాత్రీకులు త్రివేణీ సంగమంలో స్నానం చేసి పునీతులవుతారు.

ఈ కుంభమేళా ఉత్సవాలకు మహంతులు తరలి వస్తారు. వారి పతాకములు వేరు వేరుగా ఉంటాయి. వీటిలో ఆంజనేయ పతాకాలు, శివ పతాకాలు, విష్ణు పతాకాలు ముఖ్యమైనవి.

శివ పతాకాలు కలిగిన మహంతులు దిగంబరులుగా ఉంటారు. స్త్రీలు వారి మానాన్ని మూయటానికి మాత్రమే అల్ప కాషాయ వస్త్రాలు ధరిస్తారు. పురుషులు దిగంబరులుగా, భస్మదారులుగా దర్శనమిస్తారు.

యాత్రీకులు వీరి పాద ధూళిని భస్మంగా స్వీకరిస్తారు. గంగా, యమునానది మధ్యన గల ప్రదేశంలో ఈ మహంతులు దర్శనమిస్తారు.

## 15. జ్వాలాయాం వైష్ణవీదేవి

హిమాచల్ ప్రదేశ్ ఉత్తర ప్రాంతంలో కాంగ్రా నగరం ఉంది. దీనికి సుమారు 35 కిలోమీటర్ల దూరంలో జ్వాలాముఖిక్షేత్రంఉంది.

ఇక్కడ సతీదేవి పిరుదులు పడిన ప్రదేశంగా కొందరు చెబుతారు. మరికొందరు సతీదేవి నాలుక పడిన ప్రదేశంగా చెబుతుంటారు. ఈ క్షేత్రం అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటిగా విరాజిల్లుతుంది.

శివాలికి పర్వత శ్రేణిలో, కలిందర్ పర్వతం దగ్గర జ్వాలాముఖి ఆలయముంది. కొండ మీదకు మెట్ల మార్గం ఉంది. ఈ ఆలయంలో వేం చేసిన దేవిని విద్యేశ్వరీదేవిగా కొలుస్తారు. భక్తులు అమ్మవారిని వైష్ణవీదేవిగా కూడా పిలుస్తారు.

దేవాలయం రాతి దర్వాజా గుండా చూస్తే అక్కడ వెలుగుతున్న మహాజ్వాల కనబడుతుంది. ఈ మహాజ్వాలను జ్వాలాజీగా పిలుస్తారు. జ్వాలా రూపిణిగా కనబడుతున్న అమ్మవారిని జ్వాలాముఖి అని పిలుస్తూ కొలుస్తారు.

ఆలయ ప్రాంగణంలోని హోమగుండం నిరంతరం అగ్నితో ప్రజ్వరిల్లుతూంటుంది. ఆలయంలోని జ్వాలల చుట్టూ ప్రదక్షిణలు జరిపి, భక్తిశ్రద్ధలతో జ్వాలాముఖిని పూజిస్తారు.

గర్భగుడికి బయట వైపు మరొక పన్నెండు జ్వాలలు దర్శనమిస్తాయి. వీటిలో ముఖ్యమైంది 'సరస్వతి జ్వాల' ఇది నీలిరంగులో కనబడుతుంది. సరస్వతి జ్వాలవద్ద జ్వాలాముఖి దేవి ఘట్టం ఉంటుంది. ఇది చాలా పవిత్రమైంది.





జ్వాలాముఖి దేవాలయం చుట్టు పక్కల గల వీరకుండ్, ఘోరకడచ్చి, రాధాకృష్ణాలయం, శివశక్తి మందిర్, లాల్ శివాలయం, సిద్ధి నాగార్జున, కాళిభైరవ మందిరం, అంభికాశ్వేర్ మహాదేవ మందిరం, త్వేడామందిరం, అష్టాదశ భుజదేవి మందిర్ మొదలైనవి ఇక్కడ చూడదగ్గ ప్రదేశాలు.

## 16. గయా మాంగల్య గౌరికా

బీహారు రాష్ట్రంలోని పాట్నా నుండి సుమారు 110 కిలో మీటర్ల దూరంలో ఉంది గయపట్టణం. అష్టాదశ శక్తి పీఠాలలో పదహారవ పీఠం అయిన శ్రీ మంగళగౌరీ మహాశక్తి పీఠం గయక్షేత్రంలో ఉంది.

ఇక్కడ సతీదేవి యొక్క శరీర ఖండం నుండి స్తనాలు పడి శక్తి పీఠంగా ఏర్పడింది. గయలోని విష్ణుపాద దేవాలయానికి ఒక కిలో మీటరు దూరంలో గల నారాయణ చుహ అనే ప్రాంతంలో ఒక ఎత్తైయిన కొండ మీద శ్రీ మంగళగౌరి పీఠం ఉంది.

గయక్షేత్రంలో పితృదేవతలకు శ్రాద్ధ విధులను నిర్వర్తించి, పిండప్రదానం చేస్తే పితృ ఋణాన్ని తీర్చుకుని, ఇహలోకమందు, పరలోకమందు మోక్షం పొందుతారని భక్తులు నమ్ముతారు.

మంగళగౌరి దేవాలయానికి వెళ్ళటానికి కొండపైకి మెట్లున్నాయి. కొండ వెనక నుంచి రోడ్ మార్గం కూడా ఉంది. సుమారు మూడు అడుగుల ఎత్తు గల ద్వారం గుండా గర్భగుడిలోకి ప్రవేశం. ఇక్కడ అమ్మవారి స్తనములు పోలినశిలకు పూజలు చేస్తారు. భక్తులు కూడా స్వయంగా పూజలు చేసుకోవచ్చు.

ప్రతి మంగళవారం నాడు భక్తులు విశేషంగా అమ్మవారిని దర్శించడానికి వస్తారు. విజయదశమి, చైత్రమాసంలో విశేషపూజలు, ఉత్సవాలు జరుగుతాయి. అమ్మవారి ఆలయం వెనుక వైపు పార్వతీ కాళీమాతలకు దర్శించుకోవచ్చు.

స్త్రీలకు శ్రావణమాసం అత్యంత ముఖ్యమైన మాసం. మహిళలు మంగళగౌరి వ్రతం శ్రావణ మాసానికి ప్రధానమైంది. దీన్నే శ్రావణ మంగళవారవ్రతం అనీ, మంగళగౌరి నోము అనీ అంటారు. ఈ వ్రతం ఆచరించడం వల్ల మహిళలకు సౌభాగ్యకరమైన ఐదవతనం కల కాలం నిలిచి ఉంటుందని నమ్మకం.

ఈ మంగళగౌరి వ్రతాన్ని నారద మహర్షి మహా పతివ్రత సావిత్రికి చెప్పి ఆచరింపజేసినట్లు, శ్రీకృష్ణుడు ద్రౌపదికి తెలిపి స్వయంగా ఆచరింపజేసినట్లు

అలాగే త్రిపురాసుర సంహార సమయంలో శివుడు మంగళగౌరిని పూజించి విజయం సాధించినట్లు మన పురాణాలు చెబుతున్నాయి.

## 17. వారణాస్యాం విశాలక్షీ

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ఆగ్నేయంగా వారణాసి నగరం ఉంది. ఈ నగరానికి అతిప్రాచీన నామం కాశికాపురి. అసలు కాశీ అంటేనే గొప్ప వెలుగు అని అర్థం.

ఈ నగరానికి ఉత్తరంగా వరుణా నది, దక్షిణంగా అసి నది గంగానదిలో సంగమిస్తున్నాయి. ఈ రెండు నదుల మధ్యగల పట్టణమవడం వలన వారణాసిగా పేరు పొందింది.

ద్వాదశ జ్యోతిర్లింగాలలో తొమ్మిదవది అయిన శ్రీ విశ్వనాథ లింగం, అష్టాదశ శక్తి పీఠాల్లో 17వది అయిన శ్రీ విశాలక్షీ శక్తి పీఠాన్ని మనం ఇక్కడ వారణాసినందు దర్శించుకోగలం.

ఇది సతీదేవి వామహస్తం పడిన చోటుగా ప్రసిద్ధి చెందింది. ఈ అతి ప్రాచీన పుణ్యక్షేత్రం సప్తమోక్షపురాల్లో ఒకటి. అంటే ఇక్కడ మరణించిన వారికి పునర్జన్మకలగనే కలగదట.

దివ్య సుశోభితాలైన, విశాలమైన కన్నులు కలిగిన అనే అర్థంలో మనం విశాలాక్షి స్వరూపాన్ని ఇక్కడ దర్శించుకోగలం. విశాలాక్షి మందిరంలో జరిగే కుంకుమార్చన సుప్రసిద్ధమైంది. అమ్మవారు తన దగ్గరకు వచ్చే భక్తులకు సమస్త సంపదలను సమకూరుస్తుంది. భక్తుల కోర్కెలు నెరవేర్చే జగన్మాత.

ఈ ఆలయంలోని ముందు భాగంలో గల మూర్తిని జగద్గురు ఆది శంకరాచార్యులు ప్రతిష్టించారు. వెనుక భాగంలో గల మూర్తి స్వయంభు మూర్తిగా వెలిసింది. ఇక్కడ ప్రతి నిత్యం అమ్మవారికి అభిషేకాలు జరుగుతాయి.

అమ్మవారి గర్భాలయం బయటవైపు చుట్టూ శివలింగాలు, గణపతి మొదలైన మూర్తులను దర్శించుకోవచ్చు.

తెల్లవారు జామునే లేచి దుండి గణపతి, భవానీ శంకరులు, కాలభైరవుడికి నమస్కరించుకోవాలి. ఆ తరువాత కాలకృత్యాల్ని పూర్తి చేసుకోవాలి. ఉత్తర వాహిని అయిన గంగానదిలో స్నానం చేసి విశ్వేశ్వరుడిని స్మరిస్తూ దర్శనానికి వెళ్లాలి.

భవానీ దేవి, దుండి గణపతి దర్శనం తర్వాత పంచదైవాల్ని పూజించాలి. ఇక్కడ ఆదిత్యుడు, ద్రౌపది, విష్ణువు, దండపాణి, మహేశ్వరుల్ని పంచదైవాలుగా





పిలుస్తారు. మహాదేవుని పూజానంతరం మూడుసార్లు ప్రదక్షిణం చేసుకుని, పదిహేనుసార్లు నమస్కారం చేయాలి.

కాశీ పట్టణంలో వందకు పైగా శివాలయాలుండేవి. పూర్వకాలంలో సోముడు, బుధుడు, అంగారకుడు, శనీశ్వరుడు, బృహస్పతి, అగస్త్యుడు, ధృవుడు, వరుణుడు, సప్తఋషులు మొదలైన వారు కాశీక్షేత్రంలో గంగాస్నానం చేసి, విశ్వేశ్వరుడిని దర్శించుకుని, వారి పేర్ల మీదుగా లింగాన్ని ప్రతిష్టించి, తపస్సు చేసేవారు.

వారి తపస్సుకు ఆనందపడిన విశ్వేశ్వరుడు వారు ప్రతిష్టించిన లింగాలలో ఆవిర్భవించి వారికి వరాలు ఇచ్చాడు.

పరమేశ్వరుడు ఇచ్చిన వర ప్రభావంతో, వారి పేర్లతో వెలసిన లింగ దర్శనంతో వాటి మహిమల్ని భక్తులు కూడా పొందగలరు. కాశీకి చుట్టు పక్కల ఈ లింగాలను దర్శనం చేసుకోవచ్చు.

## 18. కాశ్మీరేతు సరస్వతి

కాశ్మీర్ రాష్ట్ర రాజధాని శ్రీనగర్‌కు సుమారుగా పది కిలోమీటర్ల దూరంలో ఋష్య శృంగ – శాంతాదేవి ఆలయం ఉంది. ఇక్కడ శంకరాచార్యుల ఆలయం కూడా ఉంది.

ఇక్కడ అమ్మవారి కుడి చెంప భాగం పడినట్లుగా పురాణాలు తెలుపుతున్నాయి. ఇస్లాం మత చాంధసులు కాశ్మీర్‌లో అనేక హిందూ దేవాలయాలను నేలమట్టం చేసారు. నేల మట్టమైన ఆలయాలలో శ్రీ సరస్వతీదేవి ఆలయం కూడా ఉండవచ్చు.

నేడు కాశ్మీర్‌ని శోధిస్తే ఎక్కడా శ్రీ సరస్వతీదేవి పీఠం కనిపించడం దుర్లభమే. కాశ్మీర్‌లో శ్రీ ఆదిశంకరాచార్యులు వారు పర్యటించి నపుడు సరస్వతీ పీఠాన్ని కనుగొన్నట్లు చెప్పుకుంటారు.

కాశ్మీర్ ప్రాంతంలో సరస్వతీ పీఠం అనే పేరుతో ఎక్కడా దేవిని దర్శించలేకపోతున్నాం. కాశ్మీర్‌లో అనేకమైన శక్తి పీఠాలు ఉన్నాయి. వాటిని ప్రతివారు సరస్వతీ పీఠంగా చెబుతారు. అయితే వీటిలో ప్రధానమైనది శారికాదేవి మందిరం. ఇది హరి పర్వతం మీద ఉంది.

ఇక్కడ అమ్మవారు అత్యద్భుతమైన మౌన శిల రూపంలో దర్శనమిస్తుంది. ఇదే సరస్వతి పీఠంగా స్థానికులు పూజిస్తారు.